RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 335 మేడ్చల్ మల్కాజ్‌గిరి 26 డిసెంబర్ 2024 గురువారం పేజీలు : 4

## మనాలీపై మంచు దుప్పటి

మనాలీ : హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీని మంచు దుప్పటి కప్పేసింది. రహదారులపై అర అడుగు నుంచి ఒక అడుగు మేర మంచు గడ్డకట్టింది. దీంతో.. సోలాంగ్–రొహతంగ్ రహదా రిపై వెయ్యికి పైగా వాహనాలు ఎక్కడికక్కడ స్తంభించిపోయాయి. 700 మందికి పైగా పర్యాటకులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నెహ్రూకుండ్ నుంచి సోలాంగ్ వరకు భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. దీంతో అధికారులు ముందు జాగ్రత్తగా అటల్ టన్నెల్‌కు వెళ్లడాన్ని నిషేధించారు. ఆ మార్గంలో వాహనాలను అనుమతించడం లేదు. డిసెంబరు–ఫిబ్రవరి కాలంలో మనాలీకి పర్యాటకులు పోటెత్తుతారు.

ఈ సీజన్‌లో పర్వతాలు, కొండలు, లోయలను మంచు కప్పేసి.. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. అయితే.. భారీగా మంచు కురుస్తుండడంతో జనజీవనం స్తంభించిపోయింది.



# మెదక్ చర్చిలో నాడు మాటిచ్చి సీఎంగా తిరిగొచ్చా..

## మెదక్‌లో 192 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సీఎం రేవంత్‌రెడ్డి



మెదక్ చర్చి శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. బుధవారం మెదక్ చర్చిలో క్రిస్మస్ వేడుకల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఏసు భక్తులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వందేళ్లు పూర్తి చేసుకుని మెదక్ చర్చి ఒక గొప్ప దేవాలయంగా గుర్తింపు పొందింది. అలాంటి చర్చి అభివృద్ధికి అవసరమైన నిధులు మా ప్రభుత్వం విడుదల చేసింది. ఈ చర్చికి నాకు గొప్ప అనుబంధం ఉంది. నేను పీసీసీ అధ్యక్షుడుగా ఇక్కడికి వచ్చి ఆశీస్సులు తీసుకున్నా.. మళ్లీ ముఖ్యమంత్రి హోదాలో ఈ చర్చికి వస్తానని ఆనాడు మాట ఇచ్చా అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. శతాబ్ది ఉత్సవాలతో పాటు భక్తులతో క్రిస్మస్ జరుపుకోవాలనే ఇవాళ ఇక్కడకు వచ్చా. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో దళిత, గిరిజన క్రైస్తవులకు అత్యధిక లబ్ది జరుగుతుంది. పేదలకు అందించే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ లోనూ వారికి ఎక్కువ లబ్ది జరుగుతోంది అని సీఎం రేవంత్ చెప్పారు. ఆనాడు క్రిస్టియన్ మెషినరీలు విద్య, వైద్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ఆ స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీని తీసుకొచ్చింది. ఈ ప్రభుత్వం పేదల ప్రభుత్వం. మెదక్ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళుతుంది అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు, మెదక్ జిల్లాలో రూ. 192 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. రూ. 52.76 కోట్లతో మెదక్ నియోజకవర్గంలో వివిధ గిరిజన గ్రామాలను కలుపుతూ రోడ్ల నిర్మాణం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 5 కోట్లతో ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణం చేపడుతున్నారు. మెదక్ జిల్లా స్వయం సహాయక గ్రూప్ మహిళలకు రూ. 100 కోట్ల బ్యాంక్ లింకేజీ చెక్ అందజేశారు. రూ. 35 కోట్లతో ఏడుపాయల వద్ద రోడ్డు విస్తరణ, డివైడర్ నిర్మాణం, హైమాస్ట్ లైట్స్ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు.

**వందేళ్లు పూర్తి చేసుకున్న మెదక్ చర్చి: ప్రత్యేకతలు...** మెదక్ చర్చి వందేళ్లు పూర్తి చేసుకుంది. ఈ చర్చి గురించి కొన్ని ముఖ్యమైన విషయాలు: **ఆసియాలోనే అతిపెద్ద చర్చి:** మెదక్ చర్చి ఆసియా ఖండంలోనే అతిపెద్ద చర్చిలలో ఒకటిగా గుర్తింపు పొందింది. ప్రపంచంలో వాటికన్ చర్చి తరువాత అతిపెద్ద చర్చిగా కూడా చెబుతారు. **చరిత్ర:** ఈ చర్చి నిర్మాణం 1914లో ప్రారంభమై 1924లో పూర్తయింది. రెవ. చార్లెస్ వాకర్ పోస్నెట్ దీని నిర్మాణానికి ముఖ్య కారకులు. **నిర్మాణ శైలి:** ఈ చర్చి గోతిక్ నిర్మాణ శైలిలో నిర్మించబడింది. దీని ఎత్తు 175 అడుగులు. చర్చిలోపలి అలంకరణ, రంగుల గాజు కిటికీలు చూపరులను ఆకట్టుకుంటాయి. **ప్రత్యేకతలు:** చర్చిలో ఉన్న పైపు ఆర్గన్ చాలా ప్రసిద్ధి చెందింది. అలాగే, బైబిల్ నుంచి దృశ్యాలను వర్ణించే రంగుల గాజు కిటికీలు ప్రత్యేక ఆకర్షణ. **స్థానం:** ఈ చర్చి తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లాలో ఉంది. హైదరాబాద్ నుంచి సుమారు 90 కిలోమీటర్ల దూరంలో ఉంది. వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఈ చర్చి ప్రాముఖ్యతను, చరిత్రను గుర్తు చేసుకోవడం చాలా ముఖ్యం.






## ‘4వేలైన్ రోడ్ల నిర్మాణానికి నిధులను మంజూరు చేయండి’

దుబ్బాక : 4వేలైన్ రోడ్ల నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు. బుధవారం మెదక్ జిల్లాలోని పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి పాపన్నపేట మండలంలోని ఏడుపాయల అమ్మవారి ఆలయానికి విచ్చేసిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గంలోని రోడ్డు పనుల విస్తీర్ణకు దుబ్బాక మండలం హబ్షీపూర్ చౌరస్తా నుంచి దుబ్బాక అంబేద్కర్ చౌరస్తా వరకు 4వేలైన్ రోడ్డు నిర్మాణానికి రూ. 20 కోట్లు,శిలాజీ నగర్ నుంచి ఏనుగుర్తి, బొప్పాపూర్ మీదుగా వెళ్లే రహదారి నిర్మాణానికి రూ. 40 కోట్ల నిధుల మంజూరు చేసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.





## వాజ్‌పేయీకి నివాళులర్పించిన రాష్ట్రపతి, ప్రధాని సహా ప్రముఖులు

దిల్లీ: మాజీ ప్రధాని వాజ్‌పేయీ శతజయంతి సందర్భంగా దిల్లీలోని ‘సదైవ్ అటల్’ వద్ద ప్రముఖులు నివాళులర్పించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్రమోదీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రులు అమిత్‌షా, జేపీ నడ్డా, ఏపీ సీఎం చంద్రబాబు, పలువురు ఎంపీలు వాజ్‌పేయీకి అంజలి ఘటించారు.

# కాంగ్రెస్‌వి ప్రకటనలు మావి అభివృద్ధికి బాటలు




## మేధావులు.. వారితో మా పాలనను పోల్చిచూడండి

### కెన్-బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ

స్వాతంత్ర్యం వచ్చాక భాజపా ప్రభుత్వాలు చేసిన అభివృద్ధిని ఇతర పార్టీల పాలనతో పోల్చి చూడాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. కెన్–బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు ఆయన నేడు ఖజురహోలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రెండు నదుల జలాలను ఆయన ప్రాజెక్టు నమూనాలో పోశారు. అనంతరం రిమోట్ బటన్ సాయంతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. “భాజపా ప్రభుత్వానికి రాష్ట్రంలో ఏడాది పూర్తయింది. ఈ కాలంలో ఇక్కడ అభివృద్ధికి కొత్త దిశ లభించింది. ఇక్కడ రూ.వేల కోట్ల విలువైన కార్యక్రమాలు మొదలయ్యాయి. నేడు కెన్–బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు శంకుస్థాపన జరిగింది. దేశాభివృద్ధిలో అటల్ బిహారీ వాజ్‌పేయీ కీలక పాత్ర పోషించారు. సుశాన్ దినోత్సవం మా ప్రభుత్వానికి ఒక్కరోజు కార్యక్రమం కాదు.. మా గుర్తింపు అది. దేశ ప్రజలు మూడోసారి కేంద్రంలో ఎన్డీయే సర్కారును ఎన్నుకొన్నారు. ఇక మధ్యప్రదేశలో వరుసగా మా పార్టీని ఎన్నుకోవడంలో సుపరిపాలన పాత్ర చాలా కీలకం. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశంలోని మేధావులు కొన్ని ప్రమాణాలను తీసుకొని.. కాంగ్రెస్, లెఫ్ట్, కుటుంబ, సంకీర్ణ పార్టీల పాలనలో ఏం పనులు జరిగాయి..? భాజపా ఉన్న చోట్ల అభివృద్ధి ఎలా జరిగిందో విశ్లేషించాలి. మా పార్టీ ప్రజల కోసం కట్టుబడి ఉంది. ప్రభుత్వ ఫలాలు ప్రజలకు ఎంత వరకు చేరాయి అన్నదే ప్రామాణికం. కాంగ్రెస్ సర్కారు కేవలం అభివృద్ధి ప్రకటనల హడావుడికే పరిమితం అవుతుంది. ఆ పథకాల ఫలాలు ప్రజలకు చేరవి కాదు. ఏళ్ల క్రితం శంకుస్థాపనలు అయిన వాటి పని కూడా ఒక్క అంగుళం ముందుకు జరగకపోవడాన్ని మేము గమనించాము. మా ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని తప్పించాము. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జల్‌శక్తిపై ఎవరు పనిచేశారో తెలుసా.. వాస్తవాలను ఇన్నాళ్లూ దాచిపెట్టారు. భారత జల్‌శక్తి, డ్యామ్‌ల వెనుక ఘనత బాబా సాహెబ్ అంబేడ్కర్‌కు చెందుతుంది” అని అన్నారు. అంతకు ముందు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ పేరిట తపాల బిళ్ల, రూ. 100 నాణెంను ప్రధాని మోదీ విడుదల చేశారు. నదుల అనుసంధానంలో మొదటిదైన కెన్–బెత్వా పథకం వల్ల ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు, ప్రత్యేకించి వెనకబడిన బుందేల్‌ఖండ్ ప్రాంతానికి ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. 2009లోనే అప్పటి కేంద్రప్రభుత్వం దీన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. మొత్తం ఒకేసారి కాకుండా దశలుగా విభజించి పనులు చేపట్టాలని నిర్ణయించింది. మొదటి దశకు 2017 జూన్‌లో పెట్టుబడి అనుమతి లభించింది.

## సంపాదకీయం

# బాబుకు సవాల్... ఆదాయానికి దారేదీ ?

ఏపీలో ఆదాయం పెరిగే మార్గాల కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. చంద్రబాబు ముఖ్యమంత్రి కాబట్టి అన్నీ ఆయన చేస్తారు సర్దుకుంటాయని సీనియర్లు మంత్రులు అంతా భారమేసి ఉన్నారు. కానీ బాబు చేతిలో కూడా మంత్ర దండం అయితే లేదు. ఆయన కూడా అన్నీ చూసుకోవాల్సిందే ఇదిలా ఉంటే బాబు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చారు. ఇంకా అనేక వర్గాలు ఇచ్చారు. అన్నీ కలసి ఆయనకు అధికారాన్ని ఇచ్చాయి. పైగా సంపద సృష్టిస్తామని అన్నారు. అయితే ఏపీ వంటి రాష్ట్రానికి సంపద సృష్టించడం ఓవర్ నైట్ లో అయితే జరిగే పని కాదని అంటున్నారు ఏపీకి రాజధాని అన్నది లేదు. ఏ రాష్ట్రం అయినా అధిక ఆదాయాన్ని తెచ్చుకునేది రాజధాని నుంచే. ఆ విషయంలో ఏపీ పదేళ్ళుగా నష్టపోతూనే ఉంది. ఇపుడు బాబు మళ్లీ సీఎం అయ్యారు కాబట్టి అమరావతి రాజధాని నిర్మాణానికి పూనుకున్నారు ఈ నిర్మాణం ఒక దశకు చేరుకునేందుకు మూడేళ్ళ కాలం పడుతుంది. అంటే 2027 కానీ 2028 కానీ అవ్వచ్చు. అప్పటికి సంపద సృష్టి అన్నది మెల్లగా సన్నని ధారగా మొదలు కావచ్చు. మరి అంతవరకూ ఏమి చేయాలన్నదే కూటమి సర్కార్ కి సవాల్ గా మారుతోంది. ఏపీలో చూసుకుంటే మద్యం దుకాణాల ద్వారా కొంత ఆదాయం వస్తోంది కానీ అది ఉచిత గ్యాస్ పథకానికి వెళ్ళిపోతోంది. దానికి తోడు అన్నట్లుగా ఏకంగా మూడు వేల నుంచి నాలుగు వేలకు సామాజిక పెన్షన్ల మొత్తాన్ని పెంచారు. దాని వల్ల ఒకేసారి కూటమి ప్రభుత్వం మీద వేల కోట్ల భారం పడుతోంది. ఇక ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షనర్లకు ప్రతీ నెలా ఒకటవ తేదీకల్లా జీతాలు పెన్షన్లు ఇస్తామని బాబు కీలక హామీ ఇచ్చారు. ఇపుడు దానిని కూడా నిలబెట్టుకోవాలి. అందుకోసం కూడా ప్రతీ నెలా చివరి పది రోజులూ ప్రభుత్వం ఆదాయం సమకూర్చుకునేందుకు తీవ్ర కసరత్తు చేయాల్సి వస్తోంది అని అంటున్నారు. ఇక సూపర్ సిక్స్ లోని కీలక హామీలు అన్నీ అలాగే ఉన్నాయి. వాటిని అమలు చేయాలీ అంటే ఇబ్బడి ముబ్బడిగా ఆదాయం అయితే ఉండాలి. కానీ సర్కార్ కి ఆదాయ మార్గాలు అయితే తక్కువగానే ఉన్నాయి. దాంతో ఏమి చేయాలి అన్నది చంద్రబాబు లాంటి అనుభవశాలి కూడా ఆలోచించేలా ఉంది అని అంటున్నారు. ప్రభుత్వానికి గతంతో పోలిస్తే ఆదాయం అయితే పెరిగింది. కానీ దానిని మించి ఖర్చులు కూడా పెరిగిపోయాయి.

దీంతోనే ఇపుడు ఇబ్బందిగా మారుతోంది అని అంటున్నా రు. ఖర్చులు తడిసి మోపెడు అయిపోతే వస్తున్న ఆదాయం ఏ మూలకూ సరిపోకపోగా ఎటు వెళ్తుందో కూడా తెలియని పరిస్థితి ఉంది. మొత్తం మీద చూస్తే ఏపీలో ఆదాయానికి దారేదీ అని కూటమి అన్వేషిస్తోంది.

# అసలే డొక్కు.. ఆపై షెడ్డుకు!



పరిగి: దోమ మండలం బాసుపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు గతనెల 27న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉస్మానియాకు రిఫర్ చేశారు. అందుబాటులో ప్రభుత్వ వాహనం లేకపోవడంతో ప్రైవేట్ వాహనంలో తరలించాల్సి వచ్చింది. పరిగి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు గత నెల 27న తమ స్వగ్రామం నుంచి బైక్‌పై పరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి కింద పడి బలమైన గాయాలయ్యాయి. ఉస్మానియాకు రిఫర్ చేశారు. అప్పటికే అంబులెన్స్ మరో ప్రాంతానికి వెళ్లడంతో ప్రైవేట వాహనమే దిక్కయింది.

వైద్యరంగానికి ఇతోధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా గ్రామీణ ఆసుపత్రుల్లో మాత్రం ఇంకా వసతులు మెరుగు పడటం లేదు. ప్రజల ప్రాణాలను నిలబెట్టే అంబులెన్సు వాహనాలు కూడా లేకపోవడంతో సకాలంలో సేవలందక రోగులు నానా అవస్థలు పడుతున్నారు. కొందరు మృత్యువాత పాలవుతున్నారు. ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది పరిగి నియోజకవర్గ ఆసుపత్రి.

**రూ.3,000 నుంచి రూ.4,000 ఖర్చు పెట్టాల్సిందే..:** నియోజకవర్గానికి ఏకైక దిక్కువగా ఉన్న పరిగి సామాజిక ఆసుపత్రికి నిత్యం వందలాది మంది రోగులు వస్తున్నారు. మెరుగైన సేవలకు నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి రిఫర్ చేస్తుంటారు. కానీ వారిని తరలించేందుకు ఉన్న ఒకే ఒక్క అంబులెన్సు వాహనం మరమ్మతుకు గురై షెడ్డుకు చేరింది. దీంతో పేదలు ప్రైవేట్ వాహనాల్లో పరిగి నుంచి హైదరాబాద్‌కు తరలించాలంటే రూ. 3,000 నుంచి రూ. 4,000 దాకా వెచ్చించాల్సి వస్తోంది.

**నెల రోజులైనా స్పందన కరవు:** బీజాపూర్ –హైదరాబాద్ జాతీయ రహదారి పరిగి నియోజకవర్గం మీదుగా వెళ్లింది. రద్దీగా ఉండే ఈరోడ్డుపై ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. వీటితో పాటు పరిగి సర్కిల్ పరిధిలోనూ రోజూ జరుగుతున్నాయి. ఆరు నెలల కాలంలో (అక్టోబరు నుంచి) 39 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 17 మంది మృత్యువాత పడ్డారు. మరో 20మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారు. ఇందుకు కారణం సరైన అంబులెన్స్ లేక చికిత్సలు దూరం కావడం.

**కొత్త వాహనాన్ని అడిగాం**

పాత వాహనం తరచూ పాడవుతోంది. దానికి బదులుగా కొత్త వాహనాన్ని సమకూర్చాలని ఎమ్మెల్యేను కోరాం. ప్రజాశ్రేయస్సులో భాగంగా ఆయన కూడా కేటాయించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. మరోసారి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.రాజశేఖర్, ఆసుపత్రి సూపరింటెండెంట్.

# బృహత్తర ప్రణాళిక



కరీంనగర్ : గతంలో తయారు చేసిన బృహత్తర ప్రణాళికలో లోపాలు ఉండటంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. నివాసిత ప్రాంతాల్లో ఉన్న జోన్లలో వాణిజ్య ప్రాంతం ఉంటే చిక్కులు వస్తున్నాయి. వ్యవసాయ భూములను నివాసిత ప్రాంతాలుగా భూమార్పిడి చేసుకోవాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి పొందాల్సి వస్తోంది. కొన్ని రహదారుల కొలతల్లో తేడాలుండటం, రోడ్లు లేని చోట రోడ్లుగా చూపించడం సమస్యలకు తావిచ్చింది. ప్రస్తుతం అలాంటి అవస్థలు లేకుండా నగర పరిధిలో ప్రణాళికలు చేస్తున్నారు.

నగరపాలిక పరిధిలో జనాభాకు తగ్గట్లుగా కాలనీల ఏర్పాటు, ఇళ్ల నిర్మాణం జరిగింది కానీ.. రహదారి విస్తరణ, సామాజిక అవసరాలకు ప్రణాళికలు లేకపోవడం లోపం. 1991లో తయారు చేసిన ప్రణాళికను 1997లో సవరించి, ఆమోదించారు. ఆ ప్రణాళికే ఇప్పటికీ అమల్లో ఉంది. 20 ఏళ్లకు ఒకసారి మాస్టర్‌ప్లాన్ తయారు చేయాల్సి ఉండగా కొలిక్కి రావడం లేదు. విలీన గ్రామాల సరిహద్దులు మారాయి. ఈ నేపథ్యంలో వచ్చే నెలాఖరులోగా సుడా, నగరానికి కొత్త ప్రణాళిక అమలు చేయడానికి కసరత్తు చేస్తున్నారు.

**అవసరాల మేరకు..**

కొత్త బృహత్తర ప్రణాళికను ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తయారు చేస్తున్నారు. గతంలో అయిదు రకాల భూములుగా విభజించడంతో అనుమతులకు సమస్యలు వస్తున్నాయి. వాణిజ్య, నివాసిత, పారిశ్రామిక, చెరువులు, కుంటలు ఉన్న చోట అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది. కొందరైతే అనుమతులు రాకపోవడంతో అక్రమ నిర్మాణాల వైపు మొగ్గు చూపించారు.

గతంలో వ్యవసాయ భూములను నివాసిత ప్రాంతాలుగా చూపించకుండా వదిలేశారు. ప్రస్తుతం విలీన గ్రామాల్లోని వ్యవసాయ భూములను సులువుగా నివాసిత ప్రాంతాలుగా మార్చుకునే వీలు కల్పించారు. 40 ఫీట్ల పైబడిన వాటన్నింటిని మిక్స్‌డ్ ల్యాండ్ కింద చూపించారు. అలకాపురి, బ్యాంకుకాలనీల్లో వంద ఫీట్ల రహదారిగా చూపించనున్నారు. ప్రస్తుతం 30 నుంచి 60 ఫీట్లకు మార్చనున్నారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా, టవర్ సర్కిల్ ప్రాంతాన్ని కమర్షియల్ జోన్‌గా గుర్తించనున్నారు.

అపోలో ఆసుపత్రి నుంచి కిసాన్‌నగర్ వరకు పారిశ్రామిక ప్రాంతంగా గుర్తించడంతో ఇబ్బందులు వచ్చాయి. దీనిని నివాసిత ప్రాంతంగా గుర్తించనున్నారు. పద్మనగర్, ఆటోనగర్ మాత్రమే పారిశ్రామిక జోన్లుగా కొనసాగిస్తారు. చెరువులు, కుంటలు ప్రస్తుతం లేకపోగా, అక్కడ నివాసిత ప్రాంతాలుగా ఉన్నప్పటికి అనుమతులు ఇచ్చే వారు కాదు. అలాంటి చోట సులువుగా అనుమతులు ఇచ్చేలా మార్పులు చేయనున్నారు.లక్ష్మీనగర్, జ్యోతినగర్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో చెరువులే లేవు. ఇళ్ల సంఖ్య పెరిగిపోగా ఇలాంటివి గుర్తించి ట్యాంకుల పరిధి నుంచి మార్చనున్నారు.

అధికారులు, ప్రభుత్వం చుట్టూ నగరవాసులు తిరగకుండా సులువైన మాస్టర్‌ప్లాన్ తయారు చేశామని మేయర్ వై.సునీల్‌రావు తెలిపారు. ఈ మేరకు ఏడో సమావేశం అనంతరం ప్రభుత్వ అనుమతికి ప్రతిపాదనలు పంపించనున్నట్లు చెప్పారు.

# నిర్మాణాల్లో ఆదర్శం.. నిర్వహణే కీలకం

కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలోని నగరాల్లో, పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో జనాభా పెరిగింది. అంతేకాకుండా కుటుంబాల సంఖ్య పెరగడంతో పారిశుద్ధ్య పనుల నిర్వహణ అధ్వానంగా మారింది. ఒకప్పుడు బహిరంగ ప్రదేశాల్లో బహిర్భూమికి వెళ్లడం.. పరిసరాలు అపరి శుభ్రంగా ఉండటం.. వ్యాధుల బారిన పడుతుండటంతో కేంద్ర ప్రభుత్వం 2014 అక్టోబరు 2న మహాత్మాగాంధీ 145 జయంతి సందర్భంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతో నిర్మాణాలు పూర్తయ్యాయి. అప్పటినుంచి వ్యక్తిగత మరుగుదొడ్లతోపాటు సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించడంతో అత్యవసర సమయాల్లో ఇబ్బందులు దూరమయ్యాయి. 'నేడు ప్రపంచ టాయిలెట్ దినోత్సవం' సందర్భంగా కథనం.

**నిధుల కేటాయింపు..**

అవసరమైన వారికి వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మించేందుకు నిధులు కేటాయించారు. సెప్టిక్ ట్యాంకులు లేని ఇళ్లను పరిశీలించి వాటిని కూడా నిర్మించారు.కరీంనగర్‌లోని మూడు డివిజన్లలో నేరుగా భూగర్భ డ్రైనేజీకి అనుసంధానం చేశారు.

ఇప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలతో స్వచ్ఛభారత్ కింద సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించుకోవడానికి నిధులు మంజూరవుతున్నాయి. ఆకర్షణీయంగా..ప్రజలను ఆకర్షించేలా కరీంనగర్, రామగుండంతో పాటు ఇతర పట్టణాల్లో ప్రజా టాయిలెట్లను అందమైన రంగులతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు.

మహిళల కోసం ప్రత్యేకంగా షీ టాయిలెట్ బస్సులు అందుబాటులోకి తీసుకొచ్చారు.

వీటిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు.

అప్పుడు ర్యాంకులు.. ఇప్పుడు అధ్వానం

కరీంనగర్ నగరపాలిక 2021లో దేశంలోనే మూడు లక్షల జనాభా కలిగిన నగరాలతో పోటీపడి 'సఫాయిమిత్ర సురక్ష ఛాలెంజ్' అవార్డు సాధించి.. రూ.4 కోట్ల నగదు పురస్కారాన్ని దక్కించుకుంది.'

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ఓడీఎఫ్, ఓడీఎఫ్ం సర్టిఫికెట్లు




సాధించి ముందు వరుసలో ఉన్నాయి. నగరంలో అయితే పలుమార్లు ఉత్తమ సులభ్ కాంప్లెక్స్‌లు గుర్తింపు పొందాయి.

ప్రస్తుతం సులభ్ కాంప్లెక్స్‌ల నిర్వహణ కొన్నిచోట్ల అధ్వానంగా తయారైంది.

పట్టణ ప్రగతిలో నిర్మించిన వాటిలో కొన్ని నిరుపయోగంగా మారాయి. ఆయా ప్రాంతాల్లో జనావాసాలు లేకపోవడంతో ఒక్కొక్కటిగా మూలనపడ్డాయి.

కరీంనగర్‌లో అయిదు చోట్ల వినియోగంలో లేకపోవడంతో నిర్వహణ భారంగా మారింది.

**స్వచ్ఛతలో సుల్తానాపూర్ భేష్**

ఎలిగేడు మండలం సుల్తానాపూర్ స్వచ్ఛతలో ఆదర్శంగా నిలుస్తోంది. 1,200 కుటుంబాలు ఉన్న ఇక్కడ ప్రజా చైతన్యం వెల్లివెరిసింది. అప్పటి సర్పంచి వెంకటేశ్వర్‌రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ఇంటింటికి మరుగుదొడ్డి నిర్మాణంతో బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామంగా ఎన్నికైంది. మరోవైపు ఇళ్లలోని వృథా నీటికి అడ్డుకట్ట వేసేందుకు ఇంటికో ఇంకుడు గుంత, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో సామూహిక ఇంకుడు గుంత నిర్మించారు. ట్రాక్టర్‌లో రోజువారీగా తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి వర్మీ కంపోస్టు ఎరువు తయారీ చేస్తున్నారు. పరిసరాల పరిశుభ్రతలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో 2022-23లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో స్వచ్ఛత అవార్డు సొంతం చేసుకుంది.

# నిర్వహణ.. శౌచనీయం

పాల్వంచ : పట్టణాలు, నగరాల్లో అత్యవసర సమయాల్లో ప్రజలు మూత్ర, మల విసర్జన చేసేందుకు వీలుగా ప్రజా మరుగుదొడ్లు (శౌచాలయాలు) నిర్మించారు. స్వచ్ఛ భారత్/సర్వేక్షణ్, పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో భాగంగా గత పదేళ్లుగా వీటి నిర్మాణం, నిర్వహణకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యమిస్తున్నాయి. కానీ, ఉమ్మడి జిల్లాలోని పుర, నగరపాలకాల్లో శౌచాలయాల నిర్వహణ తీరు రాన్రాను తీసికట్టుగా మారుతోందన్న విమర్శలున్నాయి. పలుచోట్ల అవి నిరుపయోగంగా మారాయి. వినియోగంలో ఉన్నచోట శుభ్రత, వసతుల తనిఖీ బాధ్యతల్ని అధికార యంత్రాంగం అటకెక్కిస్తోంది. పర్యవేక్షణను ఇలాగే నిర్లక్ష్యం చేస్తే పట్టణాలు సాధించిన ఓడీఎఫ్ లక్ష్యం నీరుగారేలా ఉంది. గతంలో మాదిరిగా కమిషనర్లు, అధికారులు శౌచాలయాల నిర్వహణపై దృష్టిసారించాలని.. నేడు 'ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం' సందర్భంగా పురవాసులు కోరుతున్నారు.

**76 మరుగుదొడ్లు.. 463 సీటింగ్ సామర్థ్యం**

స్వచ్ఛభారత్/సర్వేక్షణ్‌లో భాగంగా ఖమ్మం నగరంతో పాటు మున్సిపాలిటీల్లో నాలుగేళ్ల క్రితం నాటికి 76 ప్రజా మరుగుదొడ్లను 463 సీటింగ్ సామర్థ్యంతో నిర్మించారు. ఒంటికీ, రెంటికీ ప్రజలు పడే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని జన సమ్మర్థ ప్రాంతాల్లో నిర్మించడమే కాకుండా.. పురుషులు, మహిళలు, దివ్యాంగులకు వేర్వేరు వసతులు కల్పించారు. వీటి నిర్వహణ బాధ్యతలను స్థానిక పొదుపు సంఘాల సభ్యులకు అప్పగించారు. ఒక్కో సీటింగ్‌కు నెలకు రూ. 2,500 చొప్పున పురపాలకాలు నిర్వాహకులకు వేతనాల్ని చెల్లిస్తున్నాయి. కానీ పలుచోట్ల నిర్వహణ సరిగా లేక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నిర్లక్ష్యం తీరు.. స్వచ్ఛ సంకల్పానికి తూట్లు పొడిచినట్లవుతోంది. నిర్మించిన తొలినాళ్లలో మాదిరిగా అన్నిచోట్ల శౌచాలయాలను ఉపయోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. ఇలా చేస్తేనే ఓడీఎఫ్, ఓడీఎఫ్ం, ఓడీఎఫ్ గుర్తింపును కేంద్ర ప్రభుత్వం నుంచి అందుకోవడం సాధ్యమవుతుంది.సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఫోర్ సీటింగ్ సామర్థ్యంతో ప్రజా మరుగుదొడ్లు నిర్మించారు. సరైన నిర్వహణ కొరవడి వీటిల్లో రెండు (పురుషులు-1, మహిళలు-1) నిరుపయోగంగా మారాయి. పాల్వంచ పాత మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలోని మరుగుదొడ్డి ఏడాది కాలంగా నిరుపయోగంగా ఉంటోంది. ఇదే పట్టణం నవభారత్ అన్నపూర్ణ మెస్ ఎదురుగానున్న శౌచాలయం తలుపు మరమ్మతులకు గురైంది. దీంతో ఇదీ వినియోగంలో లేదు. కానీ, 2019లోనే వంద శాతం బహిరంగ మలవిసర్జన రహిత మున్సిపాలిటీగా (ఓపెన్ డేఫికేషన్ ఫ్రీ-ఓడీఎఫ్)గా ప్రకటించడం గమనార్హం. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు.

ఐదు అంశాల్లో తనిఖీలు అవసరం

1.సౌకర్యాల లభ్యత

మరుగుదొడ్ల లోపల తగినంత వెలుతురుండాలి. సీట్ల అవసరాలకు తగ్గట్టు నీరు సరఫరా చేయాలి. తలుపులకు తాళాలు బిగించాలి. వాష్ బేసిన్ ఏర్పాటు చేయాలి.

2.సురక్షితం

మహిళలు వినియోగించుకునే చోట.. ప్రాంగణం లోపల, వెలుపల సరైన కాంతి ఉండేలా చూడాలి. పీపీఈ కిట్ ధరించిన వ్యక్తి కాపలాగా ఉండాలి. ఫిర్యాదుల నమోదుకు ఏర్పాట్లు చేయాలి.

3.వేర్వేరు దారులు

శౌచాలయం లోపలకు వెళ్లేందుకు మహిళలు, పురుషులకు వేర్వేరు దారులు ఉండాలి. సులభ్ కాంప్లెక్స్ ఉన్నట్లు రహదారిపై సైన్‌బోర్డులు బిగించాలి. దివ్యాంగులకు తగిన సౌకర్యాలు కల్పించాలి.

4.శుభ్రత

అన్ని టాయిలెట్ సీట్లు ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలి. డస్ట్‌బిన్లు అందుబాటులో ఉంచాలి. కుళాయిలు లీకవకుండా మరమ్మతులు చేయాలి.

5.పర్యావరణ అనుకూలత

సోక్‌పిట్, మరుగు వెళ్లే సెప్టిక్ ట్యాంకుల అనుసంధానం సరిగా ఉండేలా చూసుకోవాలి. లీకేజీలతో పర్యావరణ కలుషితం సమస్య ఏర్పడుతుంది. సురక్షితమైన డిస్పోజల్ మిషన్ అందుబాటులో ఉంచుకోవాలి. అంతరాయం లేని నీటి సరఫరా వ్యవస్థను మెరుగు పర్చుకోవాలి. పట్టణంలోని ప్రజా మరుగుదొడ్ల నిర్వహణపై పూర్తిస్థాయిలో దృష్టిసారిస్తాం. నిరుపయోగంగా ఉన్నవాటిని నిర్వహణలోకి తీసుకొచ్చేలా అధికారులను ఆదేశిస్తాను. మరుగుదొడ్ల శుభ్రతపై సంబంధిత నిర్వాహకులకు ఎప్పటికప్పుడు సూచనలిస్తున్నాం. వాటి తనిఖీలను నిరంతరం చేయడం ద్వారా ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం.కొడారు సుజాత, పుర కమిషనర్, పాల్వంచ

# ఇసుకాసురుల బరితెగింపు

పాల్వంచ : నదులు, వాగుల పరీవాహకంలో ఇసుక తోడేళ్ల దందా యథేచ్ఛగా సాగుతోంది. కాసుల వేటలో కొందరు అక్రమార్కులు అధికారులపై దాడిచేసేందుకూ వెరవడం లేదు. ప్రభుత్వ శాఖల కళ్లుగప్పుతూ.. ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటున్న వైనం నివ్వెరబోయేలా చేస్తోంది. ముందస్తు సమాచారంతో అధికారులు వాహనాలను అడ్డగిస్తే దాడులకు బరితెగిస్తున్న వైనం జిల్లాలో చోటుచేసుకుంటోంది. మొన్న బూర్గంపాడు మండలంలో, తాజాగా పాల్వంచ మండలంలో ఇలాంటి ఘటనలు చేసుకోవడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే.. పాల్వంచ మండలం రంగాపురం గ్రామం వద్ద కిన్నెరసాని నుంచి పాల్వంచకు ట్రాక్టరుపై ఇసుకను అక్రమంగా తోలుతున్నట్లు అటవీ అధికారులకు సమాచారం అందింది. దీంతో నాగారం బీట్ ఎఫ్‌బీవో హరినాయక్ తన సిబ్బందితో కలిసి వెళ్లి ఆ ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. వాహనాన్ని అడితికి తరలించే క్రమంలో ట్రక్కుపై కూర్చున్నారు. మార్గం మధ్యలో కేశవాపురం వద్ద ట్రాక్టర్‌ను డ్రైవర్ ఓ వీధిలోకి మళ్లించి అక్కడే నిలిపివేశాడు. ఈ విషయం తెలుసుకున్న ట్రాక్టర్ యజమాని సమ్మయ్య, ఆయన తమ్ముడు సూర్య ఘటనా స్థలానికి వచ్చారు. ఎఫ్‌బీవోతో వాగ్వాదానికి దిగారు. ఇసుకను అక్కడే డంప్ చేసి వెళ్లిపోయేందుకు ప్రయత్నించారు. ట్రాక్టర్ ను అడితికి తరలించాల్సిందేని ఎఫ్‌బీవో అన్నారు. ట్రక్కు మీదనుంచి ఆయన కిందకు దిగకముందే.. డ్రైవర్ రోడ్డుపైనే ఇసుకను డంప్ చేశాడు. ఈ క్రమంలో కిందకు దిగే ప్రయత్నంలో హరినాయక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ఇతర ఉద్యోగులు డయల్-100కు ఫోన్‌చేశారు. పోలీసులు రావడాన్ని గమనించిన సమ్మయ్య, అతని తమ్ముడు ట్రాక్టర్‌ను తీసుకుని అక్కడ్నుంచి పారిపోయారు. బాధిత అధికారి ఫిర్యాదుతో సమ్మయ్య, అతడి సోదరుడు, డ్రైవర్‌పై రేంజర్ సురేశ్ అటవీ శాఖ కేసు నమోదు చేశారు. వాహనాన్ని తమ కార్యాలయంలో అప్పగించాలని యజమానిని ఆదేశించారు. ఈ ఘటనపై అటవీ శాఖాధికారులు గ్రామీణం ఠాణాలో మంగళవారం ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

**ఆర్.ఐ.పై దాడి ఘటనలో.. 45 మందిపై కేసు**


అధికారుల విధులకు ఆటంకం కలిగించి, ఆర్.ఐ.పై దాడి చేసిన ఘటనపై బూర్గంపాడు పోలీస్ ఠాణాలో కేసు నమోదైంది.

# ఉపాధ్యాయుల సృజనకు పదును

గద్వాల : ఫిబ్రవరి 28న జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్సు ఉపాధ్యాయుల నుంచి పరిశోధన పత్రాల దరఖాస్తులను రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) ఆహ్వానిస్తోంది. ఇందులో సైన్సు ఉపాధ్యాయులంతా పాల్గొనే అవకాశముంది. సైన్సు పురోగతి.. జీవన మార్గంగా సైన్సు అవసరం, ప్రాథమిక స్థాయిలో ఉత్సాహం పెంచడానికి బోధనా శాస్త్రంలో మార్పులు వంటి అంశాలు ఇందులో ఉంటాయి. ఎస్‌సీఈఆర్టీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

**వీరందరికీ అవకాశం:** ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలలు, డైట్, టీటీసీ కళాశాలల్లో సుమారు 3 వేల మందికి పైగా సైన్సు ఉపాధ్యాయులు, అధ్యాపకులు న్నారు. వీరితో పాటుగా సైన్స్ ఎడ్యుకేటర్లు, పరిశోధకులు, క్షేత్రస్థాయిలో పనిచేసే పరిశోధకులు, ఎన్జీవోకు సంబందించి ఉపాధ్యాయులున్నారు. వీరంతా సైన్సు సెమినార్‌లో పాల్గొనవచ్చు.

ఇలా పంపాలి: ఆసక్తి ఉన్న వారు తమ పరిశోధన పత్రాలను జనవరి 20వ తేదీ నాటికి పంపాల్సి ఉంటుంది. వెయ్యి పదాలకు మించకుండా, నాలుగు పేజీల్లో రాసి పంపాలి. ఆంగ్లం, తెలుగు భాషలో ఏదైనా



ఒక దాన్ని ఎంచుకొని, పీడీఎఫ్ రూపంలో %tgscertmathsscience @gmail.com%అనే మెయిల్ ఐడీకి పంపాల్సి ఉంటుంది. దీనిపై అవగాహన కల్పించేందుకు త్వరలోనే టెలీకాన్ఫరెన్స్ ఉంటుంది. పంపిన వాటిని పరిశీలించి ఎంపికైన వారికి 28న జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సదస్సులో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. ఉత్తమ వాటిని క్షేత్ర స్థాయిలో అమలుకు చర్యలు తీసుకుంటారు.

ఇదీ అంశం : ఏటా ఒక్కో అంశంపై సదస్సు ఉంటుంది. ఈ ఏడాది 'మన ప్రపంచంలో సైన్స్' అనే ప్రధానాంశంపై సెమినార్ ఉంటుంది. దీనికి అయిదు ఉప అంశాలుంటాయి.

1. సైన్సు బోధనా సాధనంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) చర్య, ప్రభావం.
2. పాఠశాలల్లో సైన్సబుల్ ఎకో సిస్టమ్ మేనేజ్‌మెంట్ కోసం వ్యూహాలు
3. విద్యార్థుల శ్రేయస్సుకు ఆహార విద్య, ఉపాధ్యాయుల పాత్ర
4. సైన్సులో విద్యా ప్రమాణాలు మెరుగుపరచడానికి శాస్త్రీయ మార్గాలు
5. కెమెస్ట్రీ నేర్చుకునే సాధనాలు, కొత్త బోధన పద్ధతులు అనే అంశాలుంటాయి. వీటి ఆధారంగా ఉపాధ్యాయులు తమ అనుభవాలను పరిశోధన పత్రాల రూపంలో పంపాల్సి ఉంటుంది.

**సద్వినియోగం చేసుకోవాలి:** సైన్సు బోధన విధానంలో మార్పు తీసుకొచ్చేందుకు ఏటా సెమినార్ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కూడా దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దీనిని సైన్సు ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలి. తమ ఆలోచలను, అనుభవాలను తెలిపేందుకు అందరూ భాగస్వాములవ్వాలి. దీనివల్ల సైన్సు బోధనలో మార్పులకు అవకాశం ఉంటుంది.
భాస్కర్ పాపన్న, జిల్లా సైన్సు అధికారి, జోగులాంబ గద్వాల

# కాల్వలు ఇలా.. నీరు సాగేదెలా?

ముస్తాబాద్ : యాసంగి సాగు పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. ఎగువ మానేరు కుడికాల్వ ద్వారా నీరు వదిలారు. అయితే జలాశయం కాల్వలో తుంగ, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి నీరు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. అయినా అధికారులు శుభ్రం చేసేందుకు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతు న్నాయి.

ఎగువమానేరు జలాశయం కుడి కాల్వ ద్వారా మూడు మండలాలకు సాగునీరందుతుంది. తెర్లుమద్ది చివరి ఆయకట్టు వరకు 21 డిస్ట్రిబ్యూటర్లు ఉన్నాయి. గంభీరావుపేట మండలంలో కొత్తపల్లి, లింగన్నపేట, మల్లారెడ్డిపేట, ఎల్లారెడ్డిపేట మండలంలోని బండలింగంపల్లి శివారు, ముస్తాబాద్ మండలంలో గోపాల్‌పల్లె, రాంరెడ్డిపల్లె, కొండాపూర్, గూడెం, గూడూరు, నామాపూర్, ముస్తాబా ద్, పోత్గల్, తెర్లుమద్ది గ్రామాల ఆయకట్టుకు కుడి కాల్వ ద్వారా సాగునీరందుతుంది.

మూడు మండలాల్లో కలిపి దాదాపు 13 వేల ఎకరాలకుపైగా ఉంది. యాసంగి సాగు కోసం గంభీరావుపేట మండలంలో 3 వేలు, ముస్తాబాద్ మండలంలో 7 వేల ఎకరాలకు సరఫరా చేయడానికి ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు.

ఈ నెల 14న ఎగువ మానేరు కుడికాల్వ ద్వారా యాసంగి సాగుకు నీరు వదిలారు. దీంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పలు గ్రామాల్లో వరినాట్లు వేసుకుంటున్నారు.

గత ఆగస్టులో కలెక్టర్ ప్రత్యేక నిధులు రూ. 2 లక్షల వరకు మంజూరు చేయడంతో ఎగువమానేరు కాల్వలో పెరిగిన తుంగ, పిచ్చి మొక్కలను తొలగించారు. తిరిగి అవి ఏపుగా పెరిగాయి. యాసంగి సాగుకు నీరు వదిలినప్పటికీ నీరు ముందుకు కదలని దుస్థితి నెలకొంది. పంట చేతికొచ్చే వరకు నీరందుతుందా లేదా అనే సందిగ్ధంలో అన్నదాతలు ఉన్నారు. అధికారులు దృష్టిసారించి కాల్వలో పెరిగిన తుంగ, పిచ్చి మొక్కలను తొలగించి చివరి ఆయకట్టు వరకు నీరు అందేవిధంగా చూడాలని అన్నదాతలు వేడుకొంటున్నారు. అదేవిధంగా కాల్వలో గ్రామ మురుగు చేరకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కూలీలతో తొలగించేందుకు చర్యలు

యాసంగి సాగు కోసం నీటిని విడుదల చేశాం. ముస్తాబాద్ శివారులోని ఎగువ మానేరు కాల్వలో పేరుకుపోయిన తుంగ, పిచ్చి మొక్కలను ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలతో తొలగించాలని నీటిపారుదలశాఖ సిబ్బంది ఇప్పటికే ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. రెండు, మూడు రోజుల్లో పంచాయతీ ద్వారా గానీ, ఈజీఎస్ కూలీల ద్వారా గానీ తొలగిస్తామని చెప్పారు. రవికుమార్, డీఈ నీటిపారుదలశాఖ

**కంపు కొడుతోంది**

కాల్వ పక్కనే బుడగజంగాలు, పెద్దమ్మ కాలనీలు ఉన్నాయి. ఎక్కడికక్కడ చెత్తాచెదారం నిండిపోయింది. గ్రామ మురుగంతా ఇందులోకి వస్తుంది. నీరు ముందుకు సాగక దుర్వాసన వస్తోంది. పాములు ఇళ్లలోకి వస్తుంటాయి. పిచ్చి మొక్కలు తొలగించాలి. నీరు సాఫీగా పారితే ఇబ్బంది ఉండదు. అధికారులు పట్టించుకోవాలి. డొక్క లక్ష్మి, 8వ వార్డు

**చివరి ఆయకట్టు వరకు నీరందించాలి**

నాకు ఎకరాన్నర ఉండగా, మరో నాలుగున్నర ఎకరాల పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాను. గత యాసంగిలో మల్లన్న సాగర్ ద్వారా ముస్తాబాద్ పెద్ద చెరువు నింపి చివరి ఆయకట్టు వరకు నీరందించారు. ఇప్పుడు కూడా మల్లన్న సాగర్ ద్వారా నింపి యాసంగి పంటలకు ఇబ్బంది లేకుండా సాగునీరందించేందుకు చర్యలు చేపట్టాలి. ఈసరి కృష్ణ, మాజీ సర్పంచి, తెర్లుమద్ది

# బీమా.. తరుణికి ధీమా



సంగారెడ్డి : మహిళలు పొదుపు సంఘాల్లో చేరుతూ.. ఆర్థికంగా ఎదిగేందుకు బాటలు వేసుకుంటున్నారు. దీనివల్ల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడుతున్నాయి. రుణాలు తిరిగి చెల్లించే సమయంలో మహిళలు ఇబ్బంది పడకూడదనేది పేదరిక నిర్మూలన సంస్థ ఉద్దేశం. ఏదైనా కారణంతో సభ్యురాలు మృతిచెందితే ఇబ్బందులు తలెత్తకూడదని.. స్త్రీనిధి ద్వారా బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. సభ్యురాలి భర్తకూ వర్తింపజేస్తున్నారు. రుణం ఇచ్చే సమయంలో ప్రీమియం మొత్తాన్ని వసూలు చేస్తున్నారు. ఈ పథకాలపై అవగాహన కల్పించాలని జిల్లా యంత్రాంగం కార్యాచరణ ప్రకటించింది.

**రూ.2 లక్షల పరిహారం**

సురక్ష(బి) పథకంలో 60 సంవత్సరాల వయసు వరకు బీమా సదుపాయం ఉంటుంది. ఆత్మహత్య మినహా .. ప్రమాదవశాత్తు భర్త మరణిస్తే రూ.2లక్షలు పరిహారం చెల్లిస్తారు. ఈ పథకంలో సభ్యులుగా చేరేందుకు ఏడాదికి రూ.230 చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. మూడేళ్ల ప్రీమియం ఒకేసారి చెల్లించవచ్చు. బీమా పథకంలో చేరిన వారు అంతర్జాలం నుంచే బాండ్‌పత్రాన్ని పొందే వెసులుబాటు కల్పించారు. బీమా ప్రీమియం చెల్లించే స్థోమతలేని వారికి స్త్రీనిధి నుంచి రుణంగా తీసుకునేందుకు అవకాశం ఉంది.

**ఎవరు అర్హులంటే**

మహిళా సంఘంలో సభ్యురాలై ఉండాలి.
18–60 ఏళ్లలోపు వయసు.
పథకంలో చేరేందుకు సభ్యురాలు ఇష్టంగా ముందుకురావాలి. : బీమా పథకానికి సభ్యురాలు నిర్ణీత రుసుం చెల్లించాలి.

దరఖాస్తు విధానం

గ్రామైక్య సంఘం వీవోఏ ద్వారా స్త్రీనిధి ద్వారా అమలు చేస్తున్న సురక్ష (బి) పథకానికి దరఖాస్తు చేసుకోవాలి. వయసును తెలియజేసే ధ్రువపత్రం, ఆధార్, ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, పాస్‌పోర్టు.. వీటిలో ఏదో ఒక గుర్తింపు కార్డును జతచేయాలి.

జిల్లాలో మహిళా సంఘాలు: 18,208
వాటిలో సభ్యులు: 1.91లక్షల మంది

సద్వినియోగం చేసుకోవాలి స్త్రీనిధి రుణం ద్వారా అమలుచేస్తున్న సురక్ష(బి) పథకాన్ని మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి. మహిళా సంఘాల సభ్యులకు సురక్ష బీమా పథకం ఉండగా.. వారి భర్త కోసం సురక్ష (బి) పథకాన్ని తీసుకొచ్చారు. బీమా పథకంతో దంపతులిద్దరూ ధీమాగా ఉండవచ్చు. సభ్యులందరూ చేరేలా అవగాహన కల్పిస్తాం. శ్రీనాథ్, స్త్రీనిధి రీజినల్ మేనేజర్.

# అతివలకు ఆర్థిక సిరులు



చేగుంట : నారీమణులు వ్యాపార రంగంలో అడుగుపెట్టి ఘనమైన అభివృద్ధి సాధిస్తున్నారు. ధాన్యం కొనుగోలులో సత్తా చాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లాలో పీఏసీఎస్‌ల కన్నా దీటుగా ధాన్యం కొనుగోలు చేసి శభాష్ అనిపించుకుంటున్నారు. ముఖ్యంగా ఐకేపీలోని గ్రామైఖ్య సంఘాల్లో సభ్యులుగా చేరిన తర్వాత అందులో రుణాలు తీసుకొని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు. మహిళలే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తూ రాణిస్తున్నారు. ఈ వానాకాలంలో రైతులు పండించిన ధాన్యంను రికార్డు స్థాయిలో కొనుగోలు చేశారు. దీనివల్ల అటు రైతులకు మేలు జరిగింది. మహిళలకు కమీషన్ రూపంలో ప్రయోజనం జరుగుతుంది.

**రూ.1.88 కోట్ల ఆదాయం**

ఐకేపీ మహిళా గ్రామైఖ్య సంఘాలు రుణాలు ఇవ్వటం, తీసుకోవటంతో పాటు ధాన్యం కొనుగోలు చేస్తూ కమీషన్ రూపంలో ఆర్థికంగా లబ్ధిపొందుతున్నారు. ప్రతి సీజన్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తూ ధాన్యం తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ వానాకాలం సీజన్‌లో దొడ్డు రకంతో పాటు సన్నరకం ధాన్యం కొనుగోలు చేశారు. జిల్లాలో 119 దొడ్డు ధాన్యం, 22 సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 13,141 మంది రైతుల నుంచి దొడ్డు రకం ధాన్యంను 5,12,514 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. దీని విలువ రూ.1,18,90,33,408. అలాగే సన్న రకంను 2048 మంది రైతులు విక్రయించారు. 75,737 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. వీటి విలువ రూ.17,57,11,232. సన్న రకానికి చెల్లించిన బోనస్ రూ.3,78,68,800. మహిళా సంఘాలకు కమీషన్ సైతం రూ.1.88 కోట్లు రానున్నాయి.

**భూమి కొనుగోలు**

చేగుంట మండలం కర్నాల్‌పల్లి గ్రామైఖ్య సంఘం ఒకప్పుడు ధాన్యం కొనుగోళ్లను ముమ్మరంగా చేసేవారు. అక్కడి మహిళలు సంఘటితంగా ఉండి కొనుగోళ్ల ద్వారా వచ్చే కమీషన్‌తో మహిళా సంఘం భవన నిర్మాణం కోసం అవసరమైన స్థలం కొనుగోలు చేశారు. భవన నిర్మాణం కూడా చేశారు. సుమారు అర ఎకరం స్థలం కొనుగోలు చేశారు. ఇప్పుడు దాని విలువ రూ.లక్షల్లో ఉంది. ఇలా వారు జిల్లాలోనే ఆదర్శంగా నిలిచారు. కొన్నేళ్లుగా ఇక్కడ ధాన్యం కొనుగోళ్లు చేయలేదు. రెండేళ్లుగా తిరిగి కొనుగోళ్లు ప్రారంభించి ముందుకు సాగుతున్నారు.

**చైతన్యంతో ముందుకు: శ్రీనివాస్‌రావు, డీఆర్డీవో**

గ్రామైఖ్య సంఘాల మహిళలు చైతన్యంతో ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోళ్లలో ఆదర్శంగా నిలుస్తున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కష్టపడి ధాన్యం కొనుగోలు చేశారు. అందుకు తగ్గట్టుగా కమీషన్ రూపంలో డబ్బులు రానున్నాయి. ఏటా ఎక్కువగా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నారు.

# పాలమూరు మార్కెట్‌కు మెగా హంగులు



మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్‌లో 50 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన వ్యవసాయ మార్కెట్ రూపురేఖలు మారనున్నాయి. సమీకృత మార్కెట్‌గా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే యెన్నం సూచించటంతో 8 ఎకరాల్లో ఉన్న ఈ మార్కెట్‌లో కొత్త భవనాలు, గోదాములు, షెడ్లు, ప్రహరీ, రోడ్లు నిర్మించేందుకు మార్కెటింగ్ శాఖ సిద్ధమైంది. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ మార్కెట్‌లో లాగా ఇక్కడ అన్ని సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులు మూడు రోజులుగా క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టారు.

**ప్రస్తుత పరిస్థితిదీ:** ప్రస్తుతం మార్కెట్ కార్యాలయం, 4 రేకుల షెడ్లు, 2 గోదాములు, మరో 2 ఇతర భవనాలు మాత్రమే ఉన్నాయి. రైతులకు సరైన మరుగుదొడ్లు, విశ్రాంతి భవనాలు లేవు. మార్కెట్‌కు రైతులు తెచ్చే పంటలు వర్షాలకు తడిసిపోతున్నాయి. స్థలం సమస్య కారణంగా రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వ్యాపారులు నిల్వ చేయలేకపోతున్నారు. రైతులు మార్కెట్‌కు ధాన్యం తీసుకురావాలంటేనే భయపడుతున్నారు. ఉదయం వచ్చిన వాహనాలకే లోపలి వచ్చేందుకు అనుమతి ఇస్తున్నారు. చాలా మంది రైతులు రాత్రే వచ్చి ఉంటున్నారు. ప్రధాన రోడ్డుపై వాహనాలు బారులుదీరుతున్నాయి. కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేందుకు సదుపాయాలు లేవు. గిట్టుబాటు ధరలు రావటం లేదు.

**చేసే ఏర్పాట్లు ఇవే:** వర్షం వస్తే వాహనాలు నేరుగా షెడ్ల కింద నిలబెట్టేలా నిర్మాణాలు చేపట్టనున్నారు. రైతులు తడిసిన ధాన్యం తెచ్చినా ఎండబెట్టేందుకు, శుద్ధి చేసేందుకు యంత్రాలు ఏర్పాటు చేస్తారు. నాలుగు ద్వారాల వద్ద కొత్త రోడ్లు నిర్మిస్తారు. కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులకు ప్రత్యేక గదులు, రైతులకు విశ్రాంతి భవనాలు నిర్మిస్తారు. ఇందుకు రూ. 25కోట్ల నుంచి రూ. 30కోట్ల వరకు ఖర్చు పెట్టనున్నట్లు ప్రాథమిక సమాచారం. ఈ విషయమై మార్కెట్ ఛైర్‌పర్సన్ అనితని సంప్రదించగా ఉమ్మడి జిల్లాలోని అన్ని మార్కెట్ల కంటే భిన్నంగా ఇక్కడ అన్ని వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందుకు ఎన్ని నిధులు అవసరమైనా ఖర్చు చేసేందుకు సీఎం అంగీకరించారని పేర్కొన్నారు.

# కొత్తపల్లి పట్టణం.. కార్పొరేషన్‌లో విలీనం!

కరీంనగర్ : కొత్తపల్లి పట్టణమిక కరీంనగర్ కార్పొరేషన్‌లో అంతర్భాగంకానుంది. శాసనసభలో మంత్రి శ్రీధర్‌బాబు ఈ విషయాన్ని వెల్లడించడంతో స్థానికంగా చర్చ జరుగుతోంది. అధికారికంగా దీనికి సంబంధించిన ఉత్తర్వులు, గెజిట్ రావాల్సి ఉంది. ఈ పురపాలికతో పాటు నగరం చుట్టూ ఉన్న మరో ఆరు గ్రామాలను కూడా కరీంనగర్‌లో కలుపుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం సంకేతాలివ్వడంతో ప్రస్తుత కార్పొరేషన్ పరిధి మరింత విస్తరించనుంది.

60 డివిజన్లతో ఏర్పాటై ఉన్న నగర పాలక సంస్థ కొత్తవాటి కలయికతో భౌగోళిక పరిధి పరంగా పెద్దగా మారనుంది. ఈ ఏడాది సెప్టెంబరులో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ నగరానికి ఆనుకొని ఉన్న గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేయాలని.. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను పురపాలిక శాఖకు పంపాలని సూచించారు. అందుకనుగుణంగానే శాసనసభలో వీటి విలీనంపై చర్చ జరిగింది. స్థానిక భారాస ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వీటిని కలపొద్దని సభలో మాట్లాడారు.




ఈ గ్రామాల ప్రజలకు ఇష్టం లేకుండా కార్పొరేషన్‌లో చేర్చడాన్ని తప్పుబట్టారు. నగరపాలక సంస్థ మేయర్ సునీల్‌రావు కూడా ఈ విలీన ప్రతిపాదనతో జరిగే నష్టాలపై ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి లేఖ రాశారు. ఇప్పటికే కలిపిన ఊళ్లల్లో సరైన అభివృద్ధి జరగలేదనే విషయాన్ని అందులో పొందుపర్చారు. మరో వైపు విలీన ప్రక్రియను మాత్రం కొందరు కాంగ్రెస్ నేతలు స్వాగతిస్తున్నారు.

**మరో ఆరు గ్రామాలు సైతం..**

నగరానికి ఆనుకొని ఉన్న బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్, చింతకుంట, లక్ష్మీపూర్, మల్కాపూర్‌తోపాటు కొత్తపల్లి పురపాలిక కార్పొరేషన్‌లో కలవనుంది. దీనివల్ల భవిష్యత్తులో ప్రస్తుతమున్న డివిజన్ల సంఖ్య పెరిగేందుకు ఆస్కారముంది. ప్రస్తుతం 60 డివిజన్లు ఉండగా.. మరో ఆరు కొత్తగా పుట్టుకొచ్చే వీలుంది. ఇటీవల కులగణన ప్రక్రియ జరగడంతో దాని ఆధారంగా అన్ని డివిజన్లలో రిజర్వేషన్లు మారే వీలుంది. దీని ఆధారంగానే కొన్ని ప్రాంతాల్లో డివిజన్ల పునర్విభజనకు కూడా అవకాశం ఉండే వీలుంది.

2018లో 8 గ్రామాలను ఇందులో విలీనం చేశారు. అప్పుడు 50 డివిజన్లు కాస్తా.. 60కి పెరిగాయి. వాటి పునర్విభజన జరిగింది. ఇప్పుడు 6 గ్రామాలతోపాటు ఒక బల్దియా కలవడంతో జనాభాతో పాటు ఇళ్ల సంఖ్య పెరుగుతుంది. నిన్న మొన్నటి వరకు కొత్తపల్లి బల్దియాతోపాటు మండల కేంద్రంగా ఉంది. ప్రస్తుతం కొత్తపల్లి నగరపాలక సంస్థలో విలీనం అవడంతో భవిష్యత్తులో ఇదే పేరుతో మండలం ఉంటుందా..? లేదా అనే దానిపై స్పష్టత లేదు. మరో వైపు ఈ ఆరు గ్రామాల పరిధిలో పలు రాజకీయ పార్టీలు ఈ నూతన ప్రతిపాదనపై భిన్న స్వరాలను వినిపిస్తున్నాయి. కొందరు మేలు జరుగుతుందని చెబుతుండగా.. ఇంకొందరు ఊళ్లకు నష్టం వాటిల్లనుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పరంగా ఇక్కడి రూపురేఖలు మారుతాయని కొందరు అంటుండగా.. మొన్నటి వరకు స్థానిక ప్రజలకు లభించిన ఉపాధి హామీ పనులు ఇక మీదట దూరమవుతాయనే ఆందోళన ఇంకొందరు వ్యక్తం చేస్తున్నారు.

కొత్త విలీన ప్రక్రియ అమలుకు నోచుకుంటే కరీంనగర్ కార్పొరేషన్ పరిధి ప్రస్తుత ఇళ్ల సంఖ్య లక్షను దాటడంతోపాటు జనాభా దాదాపు 4.50 లక్షల వరకు ఉండే అవకాశముంది. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే ఈ ఊళ్లల్లో పంచాయతీ ఎన్నికల స్థానంలో కార్పొరేషన్ ఎన్నికలు జరుగుతాయి. స్థానికంగా సర్పంచులుగా రాజకీయ భవిష్యత్తును అందుకోవాలనుకునే వారు ఇప్పుడు కార్పొరేటర్ కుర్చీ కోసం కొట్లాడాల్సి ఉంటుంది. మొత్తంగా కొత్త పంథాలో కరీంనగర్ నగరపాలక సంస్థ ప్రజలకు సేవలందించే దిశగా అడుగులు వేయబోతోంది.

# అనుసంధాన రహదారి.. అధ్వానంగా మారి!

కరీంనగర్ : నగరపాలక సంస్థ పరిధిలో ఏడాది కిందట ముఖ్యమంత్రి హామీ నిధులతో(సీఎంఏ) అట్టహాసంగా ప్రారంభించిన పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. గత ప్రభుత్వం రూ.132.94 కోట్లు కేటాయించడంతో నగరవ్యాప్తంగా రహదారులు, మురుగుకాలువలు, తాగునీటి పైపులైన్లు వేసేందుకు నిర్ణయించారు. అందులో ఒకటి కట్టరాంపూర్–కోతిరాంపూర్ అనుసంధాన రోడ్డు. ఆ పనులు కూడా మధ్యలోనే ఆపేశారు. పూర్తి చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోతుందని, ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించాలని కోరుతున్నారు.

**రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు**

కట్టరాంపూర్ నుంచి కోతిరాంపూర్‌కు వెళ్లు దారి రెండు కిలోమీటర్లు ఉంటుండగా అందులో ఒక కిలోమీటర్ మేర సీసీ రోడ్డు వేశారు. రెండువైపులా డ్రైనేజీ నిర్మించాల్సి ఉంది. అక్కడి వరకే తాగునీటి పైపులైను వేశారు.

వదిలేసిన రహదారి గుంతలు పడి దారుణంగా మారింది. అటుగా రాకపోకలు సాగించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగుకాలువలు అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు రహదారులపై ప్రవహిస్తోంది. ఇటీవల మురుగంతా రోడ్డుపై వరదలా ప్రవహించింది. తాగునీటి పైపులైను ఎక్కడ పడితే అక్కడ పగిలింది. నల్లా నీరు వస్తే చాలు రోడ్డుపై లెక్కలేనన్నీ లీకేజీలు ఉంటున్నాయి.

నిధులిస్తే ప్రారంభం

సీఎంఏ నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తే పనులు ప్రారంభమవుతాయి. నగరవ్యాప్తంగా ఇలాంటి అసంపూర్తి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వచ్చే నెల పనులు ప్రారంభించే అవకాశముంది.
వై.సునీల్‌రావు, మేయర్, కరీంనగర్

# పీజీ బోధన అంతంతే!

ఖమ్మం: అది ఖమ్మం నగరంలోని పీజీ కళాశాల.. కాకతీయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పని చేస్తుంది. ఇక్కడ పాఠాలు బోధించే అధ్యాపకులంతా ఒప్పంద, పార్ట్‌టైం పని చేస్తున్నవారే. పూర్తిస్థాయి ఉద్యోగి ఒక్కరూ లేరు. దీంతో విద్యార్థుల చదువులు కుంటు వడుతున్నాయి. ఇక్కడ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ జిల్లాల విద్యార్థులు వచ్చి చదువుకుంటారు.

**రెండు కోర్సులకు ప్రతిపాదనలు...**

గతంలో ఇక్కడ ఎంసీఏ కోర్సు ఉండేది. విద్యార్థులు చేరక రద్దు చేశారు. ల్యాబ్ అందుబాటులో ఉంది. ఇప్పుడు కోర్సుకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో రెన్యువల్ చేసుకోవాలని భావిస్తున్నారు. ఈ మేరకు విశ్వవిద్యాలయానికి ప్రతిపాదనలు పంపారు. ఆమోదం వస్తే వచ్చే ఏడాది నుంచి ఎంసీఏ అందుబాటులోకి వస్తుంది. ఎమ్మెస్సీ(మ్యాథ్స్)కూ డిమాండ్ ఉంది. దీన్ని సైతం అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు




ప్రయత్నిస్తున్నారు. కళాశాలలో సదస్సుల నిర్వహణకు విశాలమైన గదులు లేవు. మొదటి అంతస్తులో హాల్ నిర్మాణానికి నిధుల కొరత నెలకొంది. నిధులు మంజూరు చేయాల్సిందిగా ప్రజాప్రతినిధులను అభ్యర్థించారు. **ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్....**ఇదే ప్రాంగణంలోని వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్.. పీజీ కళాశాలకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా వ్యవహరిస్తున్నారు. కళాశాలలో ఇద్దరు ఒప్పంద అధ్యాపకులు, 15 మంది పార్ట్‌టైం అధ్యాపకులు పని చేస్తున్నారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చేకూరి రవికుమార్ మాట్లాడుతూ... రెగ్యులర్ అధ్యాపకులు లేకపోయినా ఆ ప్రభావం విద్యార్థులపై పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బోధనకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. వసతి, ఇతర సౌకర్యాల విశ్వవిద్యాలయం దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు.

# భవన నిర్మాణాలకు గ్రహణం

సంగారెడ్డి : ప్రజలకు విద్య, వైద్యం, ఇతరత్రా సేవలు అందించేందుకు వీలుగా పక్కా భవనాలు నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. రూ.కోట్లలో నిధులు మంజూరు చేసింది. ఆయా నిర్మాణాల పనులు ఏడాది లోపు పూర్తి చేయాల్సి ఉండగా.. సగం చోట్లయినా వినియోగంలోకి రాలేదు. గుత్తేదార్ల నిర్లక్ష్యం, స్థలాల సమస్య, టెండర్లు పిలిచినా పనులు చేపట్టడానికి ముందుకు రాకపోవడం, బిల్లుల చెల్లింపులో జాప్యం తదితర కారణాలతో నిర్మాణాల్లో జాప్యం జరుగుతోంది. జిల్లాలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణాల తీరిది.

**అదనపు నిధులకు నిరీక్షణ**

జిల్లాలో ఒక్కో ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి రూ.20 లక్షలు కేటాయించారు. 81 భవనాలు మంజూరు కాగా.. 20 చోట్ల మాత్రమే పనులు తుది దశకు చేరాయి. ఈ నిర్మాణాల పూర్తికి రూ.1.48 కోట్ల అదనపు నిధులు కావాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. మంజూరు కాలేదు. పీహెచ్‌సీ భవనాల పనులకూ అదనపు నిధుల మంజూరు చేయాల్సి ఉంది. జిల్లాకు 105 అంగన్‌వాడీ భవనాలు మంజూరైనప్పటికీ ఒక్కటీ పూర్తికాలేదు. ఒక్కో నిర్మాణానికి రూ.8 లక్షలు కేటాయించారు. అద్దె గదుల్లో అరకొర వసతుల మధ్య చిన్నారులు, గృహిణులు, గర్భిణులకు సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది.

**స్థానిక సంస్థలకు ప్రజాప్రతినిధులు లేకపోవడంతో..**

పల్లెల్లో ప్రభుత్వ భవనాలకు స్థలం ఎంపిక నుంచి నిర్మాణం పూర్తై వినియోగంలోకి వచ్చే వరకు స్థానిక సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు చొరవ తీసుకుంటారు. ప్రస్తుతం వారి పదవీ కాలం పూర్తవడంతో చొరవ తీసుకునేవారు కరవయ్యారు. దీంతో గుత్తేదారులు సైతం ఆసక్తి చూపడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

**మార్చిలోపు పూర్తి చేస్తాం..: జగదీశ్వర్, పీఆర్ ఈఈ, సంగారెడ్డి**

పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు గతంతో పోల్చితే వేగవంతమయ్యాయి. ఇప్పటికీ పనులు ప్రారంభించనివి, అసంపూర్తిగా ఉన్న వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. వచ్చే మార్చిలోపు నిర్మాణాలు వినియోగంలోకి వచ్చేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. సంబంధిత అధికారులతో మళ్లీ సమీక్ష నిర్వహిస్తాం. కొన్నిచోట్ల గుత్తేదారులు ముందుకు రాకపోవడం పనులపై ప్రభావం చూపుతోంది.

# హరిత వికాసం

అచ్చంపేట : ఉమ్మడి జిల్లాలో అటవీ సంరక్షణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు ఫలితాలనిస్తున్నాయి. 2021-23 మధ్య కాలంలో అటవీ విస్తీర్ణంపై కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ విడుదల చేసిన 'ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్-2023' ప్రకారం రాష్ట్రంలోని 13 జిల్లాల్లో అటవీ విస్తీర్ణం తగ్గగా.. 20 జిల్లాల్లో పెరిగింది. అందులో నాగర్‌కర్నూల్ జిల్లాలో 50.33 చదరపు కిలో మీటర్ల మేర పెరిగినట్లు పేర్కొన్నారు. మొత్తం 2,49,668 చ.కి.మీ అటవీ విస్తీర్ణంతో నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో ఉంది.

దేశంలోని అటవీ విస్తీర్ణం లెక్కించేందుకు రెండేళ్లకోసారి ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ఉపగ్రహం ద్వారా అధ్యయనం చేస్తోంది. నిర్ణీత ప్రదేశంలో ఉండే చెట్ల సంఖ్యను బట్టి అడవులను దట్టమైన, మధ్యస్థాయి, బహిరంగ అడవులుగా విభజిస్తారు.

**అవగాహన కల్పించడంతో...:** పోడు భూములు, పశువులు, జీవాల మేత, కలప, వంట చెరుకు, తదితర వాటి కోసం సమీప ప్రజలు అడవులను నరుకుతున్నారు. వీరి జీవనాధారం అడవే. దీంతో అటవీ విస్తీర్ణం తగ్గుతుంది. అయితే నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రజలకు అడవుల సంరక్షణపై అవగాహన కల్పించడం.. అడవులపై ఆధారపడకుండా జీవనోపాధి కల్పించడం.. అటవీ ప్రాంతంలోకి ప్రజల ప్రవేశాలను కట్టడి చేయటం.. తదితర కారణాలతో విస్తీర్ణం పెరిగింది.

**నిఘాతోనే ఫలితం...- రోహిత్ గోపిడి, జిల్లా అటవీ శాఖాధికారి, నాగర్‌కర్నూల్**

కలప అక్రమ రవాణ, వ్యవసాయం, పశువుల మేత కోసం చెట్లను నరకడంతో విస్తీర్ణం క్షీణిస్తుంది. దీంతో అటవీ ఆక్రమణలు జరగకుండా సిబ్బంది పకడ్బందీ నిఘా ఉంచారు. నిత్యం అటవీ ప్రాంతాన్ని సందర్శిస్తున్నారు. దీంతో సహజంగానే చెట్లు పెరిగి దట్టమైన అడవిగా మారాయి. వాస్తవానికి నాగర్‌కర్నూల్ జిల్లాలో 52 చ.కి.మీ పైగా విస్తీర్ణం పెరిగింది.

# సిరులవేణికి.. జవసత్వాలు



కొత్తగూడెం : ఏ సంస్థ విజయంలోనైనా సమర్థ మానవ వనరులు కీలకపాత్ర పోషిస్తాయి. ఓ వైపు యాంత్రీకరణ అనివార్యంగా మారిన పరిస్థితుల్లోనూ యువ ఉద్యోగుల నియామకాలతో సిరుల వేణి సింగరేణి కొత్త జవసత్వాలను సమకూర్చుకుంటోంది. ఉత్పత్తిలో కొన్నేళ్లుగా ఆశించిన వృద్ధిని నమోదు చేయలేని నల్లనేలలో.. వచ్చే ఏడాదైనా బొగ్గు నిల్వలను సమృద్ధిగా వెలికితీయాలనే సంకల్పంతో యాజమాన్యం ముందడుగులు వేస్తోంది.

ప్రస్తుతం సింగరేణివ్యాప్తంగా 43 వేల మందికి పైగా రెగ్యులర్ ఉద్యోగులుండగా.. వీరిలో ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లొమా, బీటెక్‌తో పాటు రెగ్యులర్ డిగ్రీలు, ఎంబీఏ విద్యార్హతలు కలిగిన వారే 90 శాతం మంది ఉన్నారు.

**సింగరేణి..** దక్షిణ భారత పరిశ్రమల బొగ్గు అవసరాలను తీర్చడంలో ముందున్న బొగ్గు సంస్థ. కోలిండియా పరిధిలో కీలక భూమిక పోషిస్తోంది. తొలినాళ్లలో భూగర్భగనులపై ఆధారపడటంతో లక్ష మందికిపైగా ఉద్యోగులతో సంస్థ అలరారింది. ఆ తర్వాత ఉపరితల గనుల ప్రారంభంతో క్రమంగా యాంత్రీకరణపై ఆధారపడక తప్పని పరిస్థితి ఎదురైంది. ఫలితంగా.. గత రెండు దశాబ్దాలుగా శాశ్వత ఉద్యోగుల సంఖ్య తగ్గుముఖం పడుతూ వచ్చింది. ఇదే క్రమంలో, గత రెండు మూడేళ్లుగా దేశీయ బొగ్గుకు డిమాండ్ పెరుగుతూ రావడంతో, ఉన్నత విద్యావంతులైన యువతను నేరుగా నియమించుకునేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంటోంది. ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పూర్వ ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని ఏరియాల్లో ఇదొక కొత్త ఒరవడిగా మారింది. గత నాలుగేళ్లలో నేరుగా నియామకాల ద్వారా విధుల్లో చేరిన వారు 6 వేల మందికిపైగా ఉన్నారు. ఒక్క 2024లోనే 2,165 మంది శిక్షణ అధికారులు, ఇతర ఉద్యోగులుగా బాధ్యతలు చేపట్టారు. వీరిలో దాదాపు 80 శాతం మంది గ్రాడ్యుయేట్లే కావడం విశేషం. మరోవైపు వారసత్వ ఉద్యోగాలూ జోరందుకున్నాయి. ఈ మార్గంలో గనుల్లో చేరిన వారిలో దాదాపు 90 శాతం మంది డిగ్రీ, బీటెక్ పట్టభద్రులే. గతంలో నిరక్షరాస్యులైన ఉద్యోగులు అధిక వేతనాలు అందుకున్నది కేవలం సింగరేణిలోనే. వీరి శాతం దాదాపు తగ్గుముఖం పట్టింది. దశాబ్దం క్రితం నాటికి వీరు 40 శాతం మంది ఉండగా.. ప్రస్తుత ఏడాది నాటికి 10 శాతానికి తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అంతర్గత నియామకాల ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్న నమ్మకంతో నిరుద్యోగ యువత ఉద్యోగాలకు పోటీపడుతోంది.

1871 సంవత్సరంలో సింగరేణి గ్రామంలో మొట్టమొదట బొగ్గు నిల్వలు కనుగొన్నారు. అప్పటి బ్రిటీషు ప్రభుత్వ ఆదేశాలతో 'జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా' అధికారి డా.విలియం కింగ్ అధ్యయనం చేసి బొగ్గు నిక్షేపాలను గుర్తించారు. ఆ తర్వాత బొగ్గు నిల్వలను వెలికితీసేందుకు 1886లో ఏర్పాటైనదే 'దక్కన్ కంపెనీ'. మూడేళ్ల ప్రయత్నాల అనంతరం తొలిసారి ఇల్లెందులో నల్ల బంగారాన్ని వెలికితీశారు. ఇందుకు 1889లో ఇల్లెందులోని స్ట్రట్ పిట్ గని వేదికగా నిలిచింది. బొగ్గు వెలికితీత పనులకు స్థానికులు భయపడగా.. అప్పట్లోనే యూపీ, బిహార్ తదితర రాష్ట్రాల నుంచి కార్మికులు తరలొచ్చారు. అలా ప్రస్తుతం సింగరేణిలోని పలు ఏరియాలు మినీ భారత్‌గా రూపాంతరం చెందాయి.

1920లో దక్కన్ కంపెనీ 'ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్'గా మార్పు చెందడం ఓ కీలక పరిణామం. పేరు మార్పును అప్పటి బ్రిటీష్ సర్కారు లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదు చేసింది. 1945లో నిజాం ప్రభుత్వం షేర్లను కొనుగోలు చేయగా.. ఈ పరిశ్రమ క్రమంగా దాని యాజమాన్యంలోకి మారింది. ఆ తర్వాత సంస్థానం భారత్‌లో విలీనం కాగా.. తదనంతర పరిణామాల్లో 'సిరుల వేణి' కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లోకి వరుసగా 49, 51 శాతం వాటాలతో వచ్చి చేరింది. రాష్ట్ర విభజనానంతరం ఏటేటా తెలంగాణ ప్రభుత్వానికి ఈ సంస్థ సుమారు రూ.500-రూ.900 కోట్ల రాయల్టీ చెల్లిస్తుండటం కొసమెరుపు.

**సమున్నత లక్ష్యాలతో ముందుకు..**

ప్రస్తుత వార్షిక సంవత్సరానికి 74 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్న సింగరేణి.. యాంత్రీకరణపై దృష్టిసారిస్తోంది. ఓ వైపు యువ ఉద్యోగుల నియామకాలతో పాటే 800కి పైగా అందుబాటులో ఉన్న విలువైన యంత్ర సంపదను సద్వినియోగం దిశగా అడుగులు వేస్తోంది. 2025 నాటికి థర్మల్ విద్యుత్తు వినియోగాన్ని 'నెట్ జీరో' స్థాయికి చేరే లక్ష్యాన్ని విధించుకుంది. 2002 నుంచి 'సింగరేణి ఆవిర్భావ' వేడుకలు జరుగుతున్నాయి. ఈ మధ్యకాలంలో సంస్థ సాధించిన విజయాలు.. ముఖ్య ఘట్టాలు..

**1 నెట్‌జీరో:** ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అభివృద్ధికి సింగరేణి ప్రాధాన్యమిస్తోంది. 2024లో కొత్తగూడెంలో 10.5 మెగావాట్ల సౌరవిద్యుత్తు ప్లాంటును ప్రారంభించింది. 'నెట్ జీరో' లక్ష్యంతో థర్మల్‌కు ప్రత్యామ్నాయంగా సుమారు 300 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తికి చేరువైంది.

**2 కొత్తగనులు:** వచ్చే వార్షిక సంవత్సరాంతానికి ఉమ్మడి ఖమ్మంలోని వీకే ఓసీ, రొంపేడు, బెల్లంపల్లి ఏరియాలో గోలేటి, ఒడిశా రాష్ట్రంలోని నైనీ కోల్‌బ్లాక్‌లు అందుబాటులోకి రానున్నాయి. తాడిచెర్ల బ్లాక్-2ను దక్కించుకునేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సాయంతో కేంద్రంతో సంప్రదింపులు జరుగుతున్నాయి.

**3 రక్షణ..:** గనుల్లో ప్రమాదాలకు అవకాశాలెక్కువ. ఈ క్రమంలో రక్షణతో కూడిన విధులకు ప్రాధాన్యమిస్తూనే.. దురదృష్ట సంఘటనల్లో నష్టపోయిన ఉద్యోగ కుటుంబాలకు అండగా నిలిచే ప్రయత్నం జరుగుతోంది. ఎవరైనా ప్రమాదంలో చనిపోతే రూ.కోటి పరిహారం పొందే 'ఉచిత ప్రమాద బీమా పథకం' ఈ ఏడాది నుంచే అమలులోకి తెచ్చారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులైతే రూ.30 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది.

4 **విద్యాభివృద్ధి:** సింగరేణి కుటుంబాల పిల్లల కోసం అన్ని నియోజకవర్గాల్లో 'అంబేద్కర్ విజ్ఞాన కేంద్రాల' ఏర్పాటుకు యాజమాన్యం నిర్ణయించింది. త్వరలో ఇవి ప్రారంభంకానుండగా.. సీబీఎస్ఈ విద్యకూ శ్రీకారం చుట్టింది.

**5 ఉద్యోగాల కల్పన:** కారుణ్య నియామకాల గరిష్ఠ వయో పరిమితిని 35 నుంచి 40 ఏళ్లకు పెంచడం మరో కీలక నిర్ణయం. ఉద్యోగాల భర్తీలో 'స్థానికత' అంశం ప్రభావిత ప్రాంత యువతకు మెరుగైన ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. ఔట్ సోర్సింగ్‌లోనూ 80 శాతం ఉద్యోగాలు వీరికే దక్కడం ఊరట కలిగించే అంశం.

**6 కార్మిక సంక్షేమం..:** గత దసరా వేళ రూ.796 కోట్లను లాభాల్లో వాటాగా పంచిన సింగరేణి.. దీపావళి బోనస్‌గానూ ప్రతి కార్మికోద్యోగికి రూ.93,750 పంచింది. తొలిసారిగా బీసీ లైజన్ అధికారి నియామకం ఇటీవలే జరిగింది.

**7 నైపుణ్యమస్తు:** యువ ఉద్యోగుల కోసం రామగుండం, మందమర్రి ఏరియాల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఈ ఏడాదే ప్రారంభించారు.

"కొత్త ఉద్యోగాల కల్పనతో సింగరేణిలో యువరక్తం ప్రవహిస్తోంది. ప్రభుత్వ అండతో సింగరేణి వచ్చే వార్షిక సంవత్సరం బొగ్గు ఉత్పత్తి నమోదులో వృద్ధికి నాంది పలకనుంది. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌కు అనుమతులు వచ్చేలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయంగా ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడారు. ప్రమాద రహిత బొగ్గు ఉత్పత్తి, థర్మల్ 'నెట్ జీరో', కార్మిక సంక్షేమానికి పటిష్ఠ చర్యలే యాజమాన్యం తొలి ప్రాధాన్యాలు". ఎన్.బలరాం, సింగరేణి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్

# వ్యవసాయం యువసాయం


కొత్తగూడెం : వ్యవసాయ రంగానికి నేటి యువత క్రమంగా దూరమవుతోంది. కుటుంబ సంప్రదాయంగా వస్తున్న ఈ రంగాన్ని ఎంచుకోకపోవడానికి ముఖ్య కారణం.. అది గిట్టుబాటు కాకపోవడమే. సంప్రదాయ మూస ధోరణులను వీడి.. అధునాతన సాగు విధానాలు, యాంత్రీకరణ, సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటే వ్యవసాయమూ పండుగేనని గుర్తించాలి. నేడు 'జాతీయ రైతు దినోత్సవం' ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వ్యవసాయమే ప్రధానాధారం. కానీ, ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల వైపు మళ్లడంతో సంప్రదాయ కుటుంబాలకు చెందిన యువత క్రమంగా ఈ రంగానికి దూరమవుతోంది. ఎంతోమంది ఉపాధి వెతుక్కుంటూ పట్టణాలకు వలస వెళ్తున్నారని తాజాగా 'స్టేట్ ఆఫ్ రూరల్ యూత్ ఎంప్లాయ్‌మెంట్-2024' నివేదిక తేల్చింది. గిట్టుబాటు కాని కారణంగా తల్లిదండ్రులు తమ పిల్లలు కాడిపట్టేందుకు సుముఖత తెలపడం లేదు.

**చిన్న కమతాలే.. పెద్ద సమస్య**

సేద్య భూమిని కమతంగా పిలుస్తాం. సమాజంలో కుటుంబాలతో పాటే చిన్న కమతాల సంఖ్య పెరుగుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో అతి తక్కువ భూమి గల రైతులే ఎక్కువ. ఖమ్మం జిల్లాలో సగటు భూ కమతం 0.91 హెక్టార్లు కాగా భద్రాద్రి కొత్తగూడెంలో అది 1.30 హెక్టార్లుగా ఉంది. చిన్న కమతాలతో సాగు లాభసాటి కావడం లేదని, అందుకే ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను ఎంచుకుంటున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో సహకార సేద్యంపై నేటి రైతులు దృష్టిసారించాలి.

**సంకల్పం.. సరైన ప్రోత్సాహం అవసరం**

రైతుల ఆదాయం రెట్టింపు చేయాలన్నది ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితేశ్ వి పాటిల్ సంకల్పం. వారు కొత్త ప్రయోగాలపై దృష్టిసారించారు. వీటిల్లో 'సమీకృత వ్యవసాయం' ప్రధానమైనది. ఒకే కమతంలో వివిధ రకాల పంటల సాగు, అనుబంధంగా కోళ్లు, చేపలు, పాడిగేదెల పెంపకం వంటివి చేపట్టడమే ఈ విధానం. భద్రాద్రి జిల్లాలో వరి, పత్తి, కందితో పాటు వాణిజ్య పంటలైన ఆయిల్‌పాం, మామిడి తోటలు ఎక్కువ విస్తీర్ణంలో ఉన్నాయి. మిరప, మొక్కజొన్న, పత్తి, కూరగాయల సాగుకు ఖమ్మం జిల్లా రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచింది. ఆయా పంటల సాగులో సంప్రదాయ పద్ధతులకు బదులు ఆధునిక సాగు విధానాల దిశగా స్థానిక కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు రైతుల్ని ప్రోత్సహించాలి. కొత్త వంగడాలను



పరిచయం చేయాలి.

**ప్రభుత్వ మద్దతు కీలకం**

యువతరాన్ని వ్యవసాయం వైపు ఆకర్షించడానికి ప్రభుత్వం కొత్త విధానాలు, పథకాలు, ప్రోత్సాహకాలను అందించాలి. తాజాగా తీసుకున్న 'యాంత్రీకరణ పథకం' పునఃప్రారంభ నిర్ణయం ఎంతో మేలు చేయనుంది. ఇదే క్రమంలో స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా అధునాతన పరికరాలను విరివిగా అందుబాటులోకి తేవాలి. విత్తనాలు చల్లే, మందులు పిచికారీ చేసే డ్రోన్ల అవసరం ఎంతో పెరిగింది. సేంద్రియ సాగుకు తగిన ప్రోత్సాహకాలివ్వాలి. డిజిటల్ వ్యవసాయంపై శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు రైతువేదికల్లో అవగాహన కల్పించాలి. పాఠశాలలు, కళాశాలల్లో వ్యవసాయ శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలి. సాగు, పెట్టుబడి రుణాలు మరింత సులభతరం చేయాలి. ఉత్పత్తుల నిల్వ, విక్రయాలకు గోదాములు, ఈ-నామ్ వంటి మార్కెటింగ్ వ్యవస్థల్ని బలోపేతం చేయాలి. పంట ఉత్పత్తులకు అదనపు విలువ జోడించే వ్యాపార యూనిట్ల స్థాపనకు ప్రాధాన్యమివ్వాలి. ముఖ్యంగా, ఆహార ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు నెలకొల్పాలి. విత్తనోత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయించాలి. 'మహిళా శక్తి' పథకం కింద పంట ఉత్పత్తుల సేకరణ, గ్రేడింగ్, ఎగుమతి యూనిట్లు నెలకొల్పితే సాగుదారులకు గిట్టుబాటు కలుగుతుంది. ఆదర్శ రైతులతో సమావేశాలు నిర్వహించడంతో పాటు రైతు విజ్ఞాన యాత్రలను నిర్వహించాలి. ఇటీవల ఓ పర్యటనలో భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ అన్నట్టుగా.. 'గ్రామీణ టూరిజం' అభివృద్ధిపైనా దృష్టిసారించాలి.

# మళ్లీ తెరపైకి పాలమూరు -రంగారెడ్డి డీపీఆర్!

మహబూబ్‌నగర్ : కొత్త డీపీఆర్ కావాలని సీడబ్ల్యూసీ (సెంట్రల్ వాటర్ కమిషన్) కోరటంతో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల (పీఆర్ఎల్ఐ) ప్రాజెక్టు మరోసారి తెరపైకి వచ్చింది. గత ప్రభుత్వం సమర్పించిన డీపీఆర్ ప్రకారమే ఇన్నాళ్లు పనులు జరిగాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక 'పాలమూరు' పనుల్లో వేగం తగ్గింది. ఇటీవల ఉమ్మడి జిల్లాలోని 'పాలమూరు' సహా ఇతర ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భూత్పూర్‌లో జరిగిన రైతు పండగ సభలోనూ సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరులోని ప్రాజెక్టులను సాధ్యమైనంతగా పూర్తిచేసుకునేందుకు కృషి చేస్తామని వివరించారు. ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న తరుణంలో కొత్త డీపీఆర్ సమర్పించాలని సీడబ్ల్యూసీ కోరటం సందేహాలకు తావిస్తోంది.

**నీటి కేటాయింపులపై.. :** నీటి కేటాయింపుల విషయంలో డీపీఆర్‌ను సీడబ్ల్యూసీ వెనక్కు పంపింది. మైనర్ ఇరిగేషన్‌లో ఆదా చేసిన జలాలు 45.66 టీఎంసీలు పాలమూరు - రంగారెడ్డికి వాడుకుంటామని, అలాగే పోలవరం ప్రాజెక్టు నుంచి కృష్ణా డెల్టాకు మళ్లించే గోదావరి జలాల్లో ఎగువన వినియోగించుకునే వీలున్న వాటాగా మరో 45 టీఎంసీలు పాలమూరు - రంగారెడ్డికి కేటాయించినట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ అంశాలపై స్పష్టత లేకపోవడం, రాష్ట్రాలు విడిపోయిన నేపథ్యంలో సీడబ్ల్యూసీ కొత్త డీపీఆర్ కోరింది. దీనివల్ల పాలమూరు-రంగారెడ్డి పనులపై ప్రభావం పడుతుందా.. నీటి కేటాయింపుల



విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది. గోదావరి వాటాను ఇవ్వకపోతే ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాల్సి ఉంటుంది. తిరుగు జలాల నీటి కేటాయింపు డిజైన్ మార్చే అవకాశం ఉందా.. ఆయకట్టును మారుస్తారా.. అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొత్త డీపీఆర్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

**పెరిగిన అంచనా వ్యయం..:** శ్రీశైలం వెనక జలాల నుంచి 90 టీఎంసీల నీటిని ఎత్తిపోసి దాదాపు 12.30 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించడమే పాలమూరు - రంగారెడ్డి లక్ష్యం. 2015 జూన్‌లో రూ.35,200 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇచ్చింది. మొత్తం 18 ప్యాకేజీల పనులకు టెండర్లు పిలిచి గుత్తేదారులకు అప్పగించింది. ఇప్పటి వరకు దాదాపు రూ.32వేల కోట్లు వెచ్చించింది. నిర్మాణంలో జాప్యం కారణంగా ప్రాజెక్టు వ్యయం గణనీయంగా పెరిగింది. తాజా అంచనా వ్యయం రూ.58,086 కోట్లు. ఇంకా రూ.26వేల కోట్లకు పైగా నిధులు మంజూరు చేస్తేనే పనులు పూర్తవుతాయి. గత బడ్జెట్‌లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కోసం రూ.1,285 కోట్లు కేటాయించారు.

# మట్టి రోడ్లకు మహర్దశ!

ములుగు : మట్టిరోడ్లతో ఎన్నో దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్న 20 గ్రామాల ప్రజల సమస్య తీరనుంది. స్థానిక నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన నిధులు మంజూరు చేయడంతో పనులు ఊపందుకున్నాయి.

**7 కి.మీ.. 20 గ్రామాలు**

ములుగు మండలం నర్సంపల్లి నుంచి అనంత పద్మనాభస్వామి ఆలయం, క్షీరసాగర్ మీదుగా అనంతారం వరకు 4 కి.మీ., నర్సంపల్లి నుంచి అనంతారం వరకు 3 కి.మీ. ఉన్న మట్టిరోడ్లతో 20 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న అవస్థలపై పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. సమస్యను 'కేబీఆర్ ఫౌండేషన్' ఛైర్మన్ కొన్యాల బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు మమత అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన తారురోడ్డు నిర్మాణానికి రూ.3.60 కోట్లు మంజూరు చేస్తూ 2023లో ఉత్తర్వులు ఇచ్చినా నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి.

**చురుగ్గా సాగుతున్న పనులు**

అర్ధంతరంగా పనులు ఆగిపోవడంతో మళ్లీ వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. స్థానిక నాయకులు కొన్యాల బాల్‌రెడ్డి ఈ కథనాలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుటళ్లారు. స్పందించిన సీఎం తారురోడ్ల నిర్మాణానికి రూ.6 కోట్లు, క్షీరసాగర్‌లో వేడుక మండప నిర్మాణానికి రూ.1.70 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. నిధులు మంజూరు కావడంతో అధికారులు పనుల్లో వేగం పెంచారు. త్వరలోనే మిగిలిన పనులు ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ శాఖ అధికారులు తెలిపారు.

# రైలు పట్టాలే యమపాశాలై..!

మహబూబ్‌నగర్ : రైలు పట్టాలపై జరుగుతున్న ప్రమాదాల్లో నమోదవుతున్న మరణాల రేటు అధికమవుతోంది. జాగ్రత్తలు పాటించకుండా పట్టాలు దాటుతూ, మరోవైపు కొంతమంది జీవితంపై విరక్తి, విద్య, ఉద్యోగాల్లో నిరాశచెంది ఆత్మహత్యలు చేసుకునే వారి సంఖ్య నానాటికి పెచ్చుమీరుతోంది. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలోని రైల్వే పోలీస్ స్టేషన్ (జీఆర్‌పీ) పరిధిలో నిత్యం ఏదో ఓ చోట రైలు కిందపడి మృతి చెందుతున్న సంఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. జీఆర్‌పీ పరిధిలోని మూడు అవుట్‌పోస్టులు షాద్‌నగర్, గద్వాల, కృష్ణాతో పాటు మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్ల పరిధిలో పోలీసులకు కేసుల విచారణ కత్తిమీద సాములా మారింది. ఓ పక్క సిబ్బంది కొరత, గుర్తుతెలియని వ్యక్తుల వివరాలు తెలుసుకునేందుకు అపసోపాలు పడుతున్నారు. ఈ ఏడాది మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 140 కేసులు నమోదవగా.. అందులో 108 గుర్తించినవి కాగా, మిగతా 32 కేసుల్లో మృతుల వివరాలు తెలియలేదు.

**హృదయ విదారక ఘటనలు..**

జీవతంపై ఆశలు కోల్పోయి రైలు కిందపడి ఆత్మహత్యలు చేసుకునే మరణాలు హృదయ విదారకరంగా ఉంటున్నాయి. ఈ ఘటనల్లో మృతిచెందిన వారి జేబుల్లో ఎలాంటి గుర్తింపు పత్రాలు లేకపోవడం, కుటుంబీకులు, బంధుమిత్రులు ఎవరూ రాకపోవడంతో రైల్వే పోలీసులు అనాథ శవాలుగా తేల్చుతున్నారు. మార్చురీలో వారం పాటు ఉంచి పోస్టుమార్టం అనంతరం పురపాలిక పారిశుద్ధ్య కార్మికులకు అప్పగించి దహన సంస్కారాలు చేయిస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన అవసరం ఉంది.

# అపార్ కార్డు వివరాల నమోదులో ఆలసత్వం

హైదరాబాద్ : దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల్లో కేజీ నుంచి పదోతరగతి విద్యార్థులకు ఒకే గుర్తింపు కార్డు ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 'అపార్' పేరుతో ఒన్ నేషన్- ఒన్ ఐడీ కార్డును ఇతర రాష్ట్రాల్లో జారీ చేస్తోంది. అపార్ కార్డులో విద్యార్థుల వివరాలను నమోదు చేసేందుకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల విద్యాశాఖ అధికారులు, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు అలసత్వం ప్రదర్శిస్తున్నాయి. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో అపార్ గుర్తింపు కార్డులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు అందించగా.. ఇక్కడ మాత్రం నిర్లక్ష్యం చూపుతున్నారు.

ఆధార్ తరహాలో.. ఆధార్ కార్డు తరహాలో విద్యార్థులకు ప్రత్యేకంగా 'అపార్'(ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) పేరుతో కార్డును కేంద్ర విద్యాశాఖ కొన్ని నెలల నుంచి ఇస్తోంది. ఈ కార్డును జాతీయ సాంకేతిక విద్యా వేదిక (నేషనల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫోరం)కు అప్పగించింది. ఆధార్‌తో అపార్ కార్డు సంఖ్యను నమోదు




చేస్తే... విద్యార్థి పేరు, కుటుంబ వివరాలు, మార్కుల ధ్రువపత్రాలు అన్నీ తెలుసుకోవచ్చు ప్రవేశ పరీక్షలు రాసేప్పుడు ఈ సంఖ్యను నమోదు చేస్తే సరిపోతుంది.

**బహుళ ప్రయోజనాలు**

అపార్ కార్డు ద్వారా విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు లభించనున్నాయి. ఈ కార్డుపై ఉన్న నంబర్‌ను కేంద్ర, రాష్ట్ర విద్యాశాఖల వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే చాలు.. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకూ ఎక్కడ చదివారన్న వివరాలు తెరపై ప్రత్యక్షమవుతాయి. అపార్ వివరాలను అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ (ఏబీసీ) అనే ఎడ్యులాకర్‌కు అనుసంధానించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఈ విషయాలన్నీ తెలిసినా అపార్‌లో విద్యార్థుల వివరాల నమోదును పక్కన పెట్టేశారు. దీంతో హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలు ఈ ప్రక్రియలో చివరాఖరున నిలిచాయి.

# తప్పు ఒకరిది.. వివరణ మరొకరిది

కూకట్‌పల్లి: సహజంగా ప్రభుత్వ శాఖల్లో, విశ్వవిద్యాలయాల్లో తప్పు ఎవరు చేస్తే వారికి మెమో జారీ చేయడం చూస్తుంటాం. ఉన్నతాధికారులు సంబంధిత విభాగాధిపతి లేదా బాధ్యుడిని అడగడం.. ఆయన తప్పు చేసిన వారిని వివరణ కోరడం సహజంగా జరిగే ప్రక్రియ. కానీ, ఇక్కడ తప్పు చేసిన వారిని వదిలేసి.. మరి కొందరికి ఆఘమేఘాలపై మెమోలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ మూడో ఏడాది రెగ్యులర్, ఐడీపీ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఎక్స్‌టర్నల్ 10మార్కులు కలపాల్సిన ఫ్యాకల్టీ తప్పిదంతో మైనస్ అయ్యాయి. దీంతో కొంతమంది విద్యార్థులు కొన్ని సబ్జెక్టుల్లో తప్పి గగ్గోలు పెట్టడంతో యూనివర్సిటీ అధికారులు, కళాశాల ఫ్యాకల్టీ నాలుక్కరుచుకోవడం తెలిసిందే. ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకురావడంతో ఇన్‌ఛార్జి వీసీ బుర్రా వెంకటేశం వర్సిటీ అధికారుల ను వివరణ కోరారు. దీంతో రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి కళాశాల ప్రిన్సిపల్,



వైస్ ప్రిన్సిపల్, సీఎస్‌ఈ విభాగాధిపతి, పరీక్షల విభాగం ఇన్‌ఛార్జికి మెమోలు జారీ చేశారు.

**ఫ్యాకల్టీకి మినహాయింపులో ఆంతర్యమేమిటీ?:** కళాశాల మొత్తానికి ప్రిన్సిపల్ హెడ్‌గా, తర్వాత వైస్ ప్రిన్సిపల్ బాధ్యులుగా ఉంటారు. వీరిద్దరికి మెమోలు జారీ చేయడం బాగానే ఉంది. కళాశాలలో అంతర్భాగమైన సీఎస్‌ఈ విభాగాధిపతి, పరీక్షల ఇన్‌ఛార్జికి సైతం మెమోలు జారీచేసినప్పటికీ.. అసలు ఈ మొత్తం వ్యవహారానికి కారకులైన ఫ్యాకల్టీని మినహాయించడం వెనుక ఆంతర్యమేమిటన్న ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. ఫ్యాకల్టీ కళాశాలలో అంతర్భాగం కాగా.. ప్రిన్సిపల్ చూసుకుంటారన్నప్పుడు.. మరి విభాగాధిపతి, కళాశాల పరీక్షల ఇన్‌ఛార్జి కూడా అందులోనే ఉంటారన్నది గమనార్హం.

వారికి కూడా ఇస్తాం.. ఫ్యాకల్టీకి మెమోలు ఇవ్వకపోవడంపై ప్రశ్నించగా బాధ్యులందరిపై చర్యలుంటాయని జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు.

# చలితో వంటగ్యాస్‌కు డిమాండ్

హైదరాబాద్ : చలి తీవ్రత నానాటికీ పెరుగుతుండటంతో గ్రేటర్‌లో వంటగ్యాస్ వినియోగం అదే స్థాయిలో పెరుగుతోంది. సాధారణ రోజులతో పోలిస్తే ఈ సీజన్‌లో రోజువారీ సిలిండర్ల రీఫిల్లింగ్ బుకింగ్ సంఖ్య 10శాతం పెరిగింది. ముమ్ముందు మరింత పెరిగే అవకాశముంది. విద్యుత్ గీజర్లు, హీటర్ల వినియోగంతో కరెంటు బిల్లుల మోతతో బెంబేలెత్తిపోతున్న సామాన్యులు గ్యాస్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఉదయం, సాయంత్రం స్నానాలకు గ్యాస్ స్టౌపైనే నీళ్లు వేడి చేయడం, కాచి చల్లార్చిన నీరు తాగడం, కషాయాల తయారీ కోసం వంట గ్యాస్‌ను వినియోగిస్తున్నారు. దీంతో గ్యాస్ వినియోగం అమాంతం పెరిగింది. గ్రేటర్ పరిధిలో 40లక్షలకు పైగా గ్యాస్ వినియోగదారులుండగా సాధారణ రోజుల్లో రోజూ 90వేల రీఫిల్ సిలిండర్లు బుక్ అయ్యేవి. చలి తీవ్రతతో ఈ సంఖ్య లక్షకు చేరింది. ఈ సీజన్‌లోనే కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవ్వడం గమనార్హం. వరకు సగటున 15 నుంచి 17 డిగ్రీల మధ్య నమోదవగా పటాన్‌చెరులో అత్యల్పంగా 12.4 డిగ్రీలు నమోదైంది.

**ఈ సీజన్‌లోనే అత్యల్పం...:** ఈ సీజన్‌లోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గ్రేటర్‌లోని ఇతర కేంద్రాలతో పోలిస్తే పటాన్‌చెరులో సోమవారం అత్యల్పంగా 12.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాజేంద్రనగర్‌లో 13.3, హకీంపేట 15.5, హయత్‌నగర్ 16.6, హైదరాబాద్ 17.5, దుండిగల్‌లో 17.8 డిగ్రీలు నమోదైంది.

గ్రేటర్ పరిధిలో వంటగ్యాస్ కనెక్షన్లు.. హైదరాబాద్ 16,17,781మేడ్చల్ మల్కాజిగిరి 11,74,785 రంగారెడ్డి జిల్లా 12,48,928

# ఈ - వాహనం ఆదాకు వాహకం



సిద్దిపేట : 'కొత్త వాహనం ఏ కంపెనీది కొనుగోలు చేస్తారో మీ ఇష్టం. విద్యుత్తుతో నడిచేదే కొనండి, భవిష్యత్తుతరాలను కాలుష్యం నుంచి రక్షించండి..' అంటూ తాజాగా జరిగిన సమావేశంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. పెరుగుతున్న చమురు ధరలను అధిగమించడం సహా పర్యావరణ హితాన్ని కాంక్షించే ఎంతోమంది ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. విద్యుత్తు వాహనాలపై రోడ్డు ట్యాక్సు, రిజిస్ట్రేషన్ రుసుము శత శాతం మినహాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మరింత మందికి మేలు చేకూర్చనుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో పరిస్థితిపై కథనం.

ఉరుకులు, పరుగులమయంగా మారిన ప్రస్తుత తరుణంలో ప్రతి ఇంటా వాహనం అనివార్యమైంది. సామాన్యుడి నుంచి సంపన్నుడి వరకు వినియోగిస్తుండటం పరిపాటే. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాల్లో వ్యాపార, వాణిజ్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో అదేస్థాయిలో వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. మరోవైపు పెరుగుతున్న వాహన కాలుష్యం హెచ్చరికలను జారీ చేస్తోంది. ఈ తరుణంలో విద్యుత్తు వాహనాలపై ప్రభుత్వాలు దృష్టి సారించాయి.

**పెరిగిన వినియోగం:** పెరుగుతున్న కాలుష్యం, భారంగా మారుతున్న ఇంధన ధరలు, ఇతర కారణాలతో వాహనదారులు వాటి వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో ఈ-బైకు, కార్లు, ఆటోలు, సరకు రవాణా వాహనాల వినియోగం నాలుగు జిల్లాల్లో పెరుగుతోంది. వ్యాపార, వాణిజ్య సంస్థలు వీటిపై ఆసక్తి చూపుతున్నాయి.

**రిజిస్ట్రేషన్ ఇలా..**

250 వాట్ల కంటే తక్కువ శక్తి, గంటకు 25 కి.మీ. కంటే తక్కువ వేగం ఉన్న ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్ అవసరం ఉండదు. ఆపై సామర్థ్యం ఉన్న వాటిని మాత్రం రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందే.


**ఛార్జింగ్ స్టేషన్లు పెంచితే..**

పెట్రోలు ధరల పెంపుతో ఆటోవాలాలు ఛార్జింగ్ వాహనాల వైపు మళ్లుతున్నారు. సెకండ్ హ్యాండ్ కార్లు కొనుగోలు చేసి కాలం చెల్లిపోవడం, వాహన జీవిత కాలం గడువు ముగిసి తుక్కు కింద మార్చి ఆ ధ్రువపత్రం చూపిస్తే దానిపై అదనపు రాయితీ అందుతుండటంతో కొనుగోళ్లకు మరింత మంది ముందుకొస్తున్నారు. తాజాగా రోడ్ ట్యాక్సు, వాహన రిజిస్ట్రేషన్ రుసుము మినహాయింపుతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ-బైక్‌లు రూ.60 వేలు మొదలు రూ.2లక్షల వరకు అందుబాటులో ఉన్నాయి. ధరల్లో రాయితీలు కల్పించడం సహా ఈ-ఛార్జింగ్ స్టేషన్‌లను పెంచితే ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది.

వికారాబాద్ మండలం ఎన్నెపల్లికి చెందిన దీపిక ప్రైవేటు కళాశాలలలో చదువుతున్నారు. ఈబైక్ కొనుగోలు చేసి నిత్యం కళాశాలకు దానిపై వెళ్లివస్తున్నారు. అంతకుముందు పెట్రో వాహనం వినియోగించగా ప్రతి నెలా రూ.2500 వరకు ఖర్చుపెట్టేవారు. ఇప్పుడు రూ.600 వరకు ఛార్జింగ్‌కు ఖర్చవుతోంది. నాలాంటి వారికి అనుకూలంగా ఉన్నాయని, సాధారణ వాహనాలతో పోలిస్తే నిర్వహణ, కాలుష్యరహితంగా ప్రయాణం సాగుతోందని చెబుతున్నారు దీపిక.

వికారాబాద్‌కు చెందిన మల్లేశం రెండేళ్లుగా ఈ-వాహనాన్ని వినియోగిసున్నారు. తన అవసరాల నిమిత్తం దీన్ని కొనుగోలు చేశారు. ఒక్కసారి ఛార్జింగ్ పెడితే రెండు రోజుల వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనాన్ని నడిపిస్తున్నారు. గతంలో ప్రతి నెలా రూ.2000 వేల వరకు పెట్రోల్‌కు ఖర్చుపెట్టేవారు. ఇప్పుడా ఖర్చులు తప్పాయి. మరమ్మతుల బాధ కూడా తప్పిందని చెబుతున్నారాయన.

# స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతే రుడా?




గోదావరిఖని : జిల్లాలో రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా)ని స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతే ఏర్పాటు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న పరిణామాలు.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రజాప్రతినిధులు ప్రస్తుతానికి రుడా ఏర్పాటు అంశాన్ని పక్కన పెట్టేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. రుడాను ఆమోదిస్తూ అక్టోబరులో ఆదేశాలు జారీ అయ్యాయి. అందుకు సంబంధించిన కసరత్తు ప్రారంభించాల్సి ఉండగా త్వరలో పుర, నగరపాలక ఎన్నికలతో పాటు జిల్లా, మండల ప్రాదేశిక ఎన్నికలు నిర్వహించాల్సి ఉండటంతో ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశం ఉంది. రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా)పై జిల్లాలో వివాదం తలెత్తింది. రుడాకు బదులు పుడా(పెద్దపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటు చేయాలని పెద్దపల్లి ప్రజలు కోరుతున్నారు.

**పలు గ్రామాలను కలపడంతో ఇబ్బంది**

జిల్లాలో 14 మండలాల్లోని 198 గ్రామాలను రుడాలో విలీనం చేశారు. దీంతో మిగతా ప్రాంతాలకు చెందిన వారి నుంచి తమ ప్రాంతం పేరుతో సైతం ఏర్పాటు చేయాలన్న డిమాండ్ మొదలైంది. తాజాగా పెద్దపల్లి పట్టణంలో ఐక్య కార్యాచరణ కమిటీని నియమించారు. పుడా ఏర్పాటు చేయాలని వివిధ వర్గాలకు చెందిన వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా రెండు పేర్లు కాకుండా రామగిరి పేరుతో ఏర్పాటు చేస్తామన్న అభిప్రాయాన్ని మంత్రి వ్యక్తం చేశారు. ఇటు అధికార పార్టీలో రుడాపై చాలా మంది నాయకులు ఆశలు పెంచుకున్నారు. నామినేటెడ్ పదవి వస్తుందన్న ఆశతో ఎవరికి వారు ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రస్తుతం జిల్లాలో మూడు పురపాలక సంఘాలు, ఒక నగరపాలక సంస్థ ఉండటంతో వాటికి ఎన్నికలు నిర్వహించిన తర్వాతే రుడా ఏర్పాటుపై వేగం పెంచాలని నేతలు భావిస్తున్నారు. ఎన్నికలకు ముందు రుడా ఏర్పాటు చేయడం ద్వారా నామినేటెడ్ పదవి విషయంలో ఎవరి వైపు మొగ్గు చూపినా మిగతా వారి నుంచి వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశం ఉంది. ఈ కారణంగా ప్రస్తుతానికి ఎలాంటి చర్యలు చేపట్టకుండా సమయం తీసుకోవాలని భావిస్తున్నారు. డిసెంబరుతో పుర, నగరపాలక సంస్థల పాలకవర్గాల గడువు ముగుస్తుంది. జనవరిలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండటంతో అవి పూర్తయిన తర్వాతే ఏర్పాటు చేస్తే మేలన్న అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం.

# ఆగుతూ.. సాగుతూ



సిరిసిల్ల : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాగులపై చేపట్టిన చెక్ డ్యాంల నిర్మాణాలు పూర్తి కావడం లేదు.. పూర్తయితే భూగర్భ జలాలు పెరిగి వేలాది ఎకరాలకు లాభం చేకూరే అవకాశమున్నా వివిధ కారణాలతో పనులు ముందుకు సాగడం లేదు.. పూర్తయిన వాటిలోనూ కొన్ని వరదలకు ధ్వంసమై ఉపయోగం లేకుండా పోయాయి.. అధికారులు స్పందించి వెంటనే వాటికి మరమ్మతులు చేయడంతోపాటు కొత్తవాటి నిర్మాణం ప్రారంభిస్తే రైతులకు లబ్ధి చేకూరనుంది..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాగులపై 2018-19లో 114 చెక్‌డ్యాంలకు నీటిపారుదలశాఖ ప్రతిపాదించింది. 2020లో రెండు విడతలుగా 72 మంజూరయ్యాయి. వీటిలో నాలుగు జిల్లాల్లో 57 చెక్‌డ్యాంల పనులు ప్రారంభమయ్యాయి. అవికూడా నాలుగేళ్లుగా ఆగుతూ.. సాగుతూ అసంపూర్తి దశలో ఉన్నాయి. అన్నిచోట్లా ఒకే నమూనా.. రెండు వైపులా రక్షణ గోడల్లేక, నిర్మాణ దశలోనే ఏడు చెక్ డ్యాంలు వరదలకు కొట్టుకుపోయాయి. ప్రత్యేక నిపుణుల బృందం కొట్టుకుపోయిన చెక్‌డ్యాంలను పరిశీలించింది. నమూనాలను మార్చి నిర్మించాలని 2023లో ఆయా జిల్లాల నీటిపారుదలశాఖ అధికారులకు సూచించింది. ప్రతిపాదనలు మార్చడంతో నిర్మాణ వ్యయం మారుతుందని చాలాచోట్ల గుత్తేదారులు ముందుకు రాలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి.

**ఆరు నెలలే సమయం**

అసంపూర్తి నిర్మాణాలను, మరమ్మతు చేయాల్సిన వాటి పనులు ఇప్పుడే ప్రారంభిస్తే వానాకాలంలోగా పూర్తవుతాయి. ఇందుకు ఆరు నెలలే సమయముంది. ఆలస్యం చేస్తే వర్షాకాలం ప్రారంభమైతే ఈ ఏడాదీ పనులు ముందుకు సాగని పరిస్థితి. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వాటికి సంబంధించి గుత్తేదారులు 2021లోనే ఒప్పందాలు చేసుకున్నారు. కాంక్రీటు పనులు అసంపూర్తిగా ఉన్నచోట వరదలకు కొట్టుకుపోయాయి. వీటికి తిరిగి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం.. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా ఆలస్యమవుతోంది. పనుల ఒప్పందం తర్వాత తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలి. కానీ ఇప్పటికీ ఒక్కో గుత్తేదారుకు మూడుసార్లు గడువు పొడిగిస్తూ వచ్చారు. 52 చెక్‌డ్యాంలకుగాను ప్రభుత్వం రూ.287.95 కోట్ల మేర చెల్లింపులు చేసింది.

పనులపై రాజన్న సిరిసిల్ల జిల్లా ఈఈ అమరేందర్‌రెడ్డితో మాట్లాడగా అసంపూర్తి దశలో ఉన్నవి, కొట్టుకుపోయిన చోట ఇటీవల పనులు ప్రారంభించేలా గుత్తేదారులకు సూచిస్తున్నామన్నారు. పనుల కోసం పూడిక తీస్తుంటే నీటి ఊటలు వచ్చి ఆటంకం కలుగుతుందని, ఒప్పందం చేసుకున్న వారు పనులు పూర్తి చేసి శాఖకు అప్పగించేవరకు వారిదే బాధ్యత అని పేర్కొన్నారు. చాలా వాటికి గడువులు పొడిగిస్తూ వచ్చామని, వర్షాకాలం ప్రారంభంలోగా అన్ని చెక్‌డ్యాంలు పూర్తి చేయాలని ఆదేశించామని చెప్పారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మానేరు, మూలవాగులపై 24 చెక్ డ్యాంలు మంజూరైతే 8 చోట్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. పది చోట్ల పనులు చివరి దశలో ఉన్నాయి. వెంకట్రావుపేట, జయవరం, మల్లారం, మహాలక్ష్మి ఆలయం, మామిడిపల్లిలో ప్రారంభ దశలో ఉన్నాయి. మానేరుపై సిరిసిల్ల సాయినగర్‌లో రెండేళ్ల క్రితం కొట్టుకుపోయిన చెక్‌డ్యాం పనులు ప్రారంభంకాలేదు.

కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో మానేరుపై గట్టెపల్లి, వీణవంక మండలంలో కోర్కల్ చెక్‌డ్యాంలు అసంపూర్తి దశలో ఉన్నాయి.

జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైన గ్రామంలో చెక్‌డ్యాం కోతకు గురైంది. ఇదే మండలంలో మరో నాలుగుచోట్ల అసంపూర్తి నిర్మాణాలు ఉన్నాయి. శంకరపట్నం మండలం కల్వలలో చాలా ఏళ్ల కిందట నిర్మించిన చెక్‌డ్యాం గతేడాది వరదలకు పూర్తిగా కొట్టుకుపోయింది. దీనికి రూ.60 కోట్లతో ఇటీవల ప్రతిపాదనలు పంపారు. రక్షణగోడల నిర్మాణాలకు పదిశాతం ప్రతిపాదనలు పెంచి పంపారు. వీటికి నిధులు మంజూరుకావాల్సి ఉంది.

# ఊరించి.. ఉసూరుమనిపించి

వేములవాడ : జలాశయంలో సర్వం కోల్పోయిన మధ్యమానేరు నిర్వాసితులు సుమారు దశాబ్దకాలంగా రూ.5.04 లక్షల కోసం అనేక రూపాల్లో తమ నిరసనలు వ్యక్తం చేశారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోకి వస్తే ఇస్తామని ప్రకటించారు. అయితే ఈనెల 20న ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఇళ్లు నిర్మించుకోని వారికి మాత్రమే ప్రభుత్వం 4,696 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది. ఇప్పటికే గ్రామాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న 5,987 కుటుంబాలకు రూ.5.04 లక్షల చొప్పున చెల్లింపుపై స్పష్టత లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. తమకు న్యాయం చేసే విధంగా ప్రకటన చేయాలని కోరుతున్నారు. జిల్లాలోని బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయంలో కొదురుపాక, వరదవెల్లి, నీలోజిపల్లి, కొడుముంజ, సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, చీర్లవంచ, శాభాష్‌పల్లి, చింతల్‌ఠాణా, గుర్రంవాణిపల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఆయా గ్రామాల్లో 10,683 కుటుంబాలను గుర్తించి నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ కాలనీలను ఏర్పాటు చేశారు. జలాశయంలో 2017లో పూర్తి స్థాయిలో నీటి నిల్వ చేయడంతో ముంపు గ్రామాలను వదిలి తమకు కేటాయించిన ఆర్అండ్ఆర్ కాలనీల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. మరికొంత మంది ఇళ్లు నిర్మించుకోలేదు.

**రూ.5.04 లక్షల కోసం...**

2016లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మధ్యమానేరు నిర్వాసితులకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం కోసం రూ.5.04 లక్షలు ఇస్తామని ప్రకటించారు. అనంతరం వివిధ కారణాలతో చెల్లింపులు సాధ్యం కాదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తాము రూ.5.04లక్షలు



ఇస్తామని ప్రకటించడంతో అసెంబ్లీ ఎన్నికల్లో నిర్వాసితులు కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా నిలిచారు.

**ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో...**

వేములవాడలో ఈనెల 20న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఇళ్లు నిర్మించుకోని వారికి 4,696 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ జీవో జారీ చేశారు. ఇప్పటికే 5,987 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకున్నాయి. వీరికి సంబంధించి రూ.5.04 లక్షలపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో వీరిలో ఆందోళన మొదలైంది. ఇళ్ల నిర్మాణాల కోసం బ్యాంకు రుణాలు తీసుకున్నామని, అప్పులు చేశామని ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వం హామీ ఇచ్చి విస్మరించగా తమ పక్షాన పోరాడిన నాయకులు ప్రస్తుతం ప్రభుత్వంలో ఉండటంతో తమకు న్యాయం జరుగుతుందని భావించామని చెబుతున్నారు. కానీ నిరాశ తప్పలేదని పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో తమకు న్యాయం జరిగే విధంగా ప్రకటన చేయాలని కోరుతున్నారు.

**4,696 మందిలో ఇళ్లు నిర్మించే వారెందరు?**

ప్రభుత్వం ప్రస్తుతం మంజూరు చేసిన 4,696 ఇందిరమ్మ ఇళ్లలో మెజారిటీ కుటుంబాలు నిర్మాణం చేపట్టరన్న చర్చ సాగుతోంది. కొంత మంది ఇప్పటికే స్థలాలు విక్రయించగా, మరికొంత మంది ఆర్థిక పరిస్థితుల వల్ల ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. దీంతో జీవనోపాధికి ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారిలో కొంత మంది మాత్రమే నిర్మించుకునే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ప్రతి నిర్వాసితుడికి ఇవ్వాలి - కాచం నిఖిల్, నిర్వాసితుడు, సంకెపల్లి**

ఇచ్చిన హామీ మేరకు ప్రతి నిర్వాసితుడికి రూ.5.04 లక్షలు చెల్లించాలి. లేకుంటే గత ప్రభుత్వం మాదిరిగానే మోసం చేసినట్లుగా భావించాల్సి వస్తుంది. స్థానికంగా ఇళ్లు నిర్మించుకొని ఉంటున్న నిర్వాసితులకు ఏం సమాధానం చెబుతారో స్పష్టత ఇవ్వాలి. కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్న నేను రూ.5.04 లక్షలు ఇస్తామనడంతో రూ.10 లక్షల బ్యాంకు రుణం తీసుకొని ఇంటి నిర్మాణం చేపట్టా. నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం సంతోషం. కాని ఇళ్లు నిర్మించుకున్న వారిపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో వారిలో ఆందోళన మొదలైంది.

**మంజూరు పత్రాలు ఇస్తే...- సట్ట వెంకటేశం, కొదురుపాక**

ఆర్థిక ఇబ్బందులతో ఇప్పటి వరకు ఇంటి నిర్మాణం చేపట్టలేదు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. అధికారులు మంజూరు పత్రాలు, అనుమతులు ఇస్తే త్వరలోనే ఇంటి నిర్మాణం ప్రారంభిస్తాను. ఇళ్లు లేని నాలాంటి వాళ్లకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది.

# మొక్కజొన్నపై మక్కువ

చింతకాని : అన్నదాతలు మక్కలపై మక్కువ పెంచుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా రబీలో ఏటేటా మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరుగుతోంది. వాణిజ్య పంటల సాగుకు ప్రతికూల అంశాలు కలవరపెడుతుంటే మక్కల విషయంలో సానుకూల పరిణామాలు రైతుల ఆసక్తికి కారణమవుతున్నాయి. ప్రకృతి ప్రతికూలతలతో గత మూడేళ్ల నుంచి జిల్లాలో పత్తి, ఇతర వాణిజ్య పంటలు సరైన దిగుబడి రాలేదు. మద్దతు ధర సైతం దక్కక పలువురు రైతుల, కౌలుదారులు మధ్యలోనే పత్తి పంటను తొలగిస్తున్నారు. ఆయా క్షేత్రాల్లో మొక్కజొన్నను విత్తుతున్నారు.

**లాభసాటిగా భావిస్తూ..**

2019లో క్వింటా మొక్కజొన్న ధర రూ.1,550 నుంచి రూ.1,750 వరకు ఉండగా ప్రస్తుతం రూ.2300- 2800కు చేరింది. విత్తు, పై పాట్లు, కంకిపట్టటం, ఆరబోయట వంటి పనులన్నీ యంత్రాల ద్వారానే చేపడుతుండటంతో కూలీలపై ఆధారపడే అవసరం ఉండటం లేదు. పది ఎకరాల సాగుకూ కేవలం కుటుంబంలో ఇద్దరి శ్రమ సరిపోతోంది. అనుకూల పరిస్థితుల్లో ఎకరానికి 40 క్వింటాళ్ల సరాసరి దిగుబడి వస్తుంది. ఖర్చులన్నీ పోను రూ.40 వేల వరకూ మిగులుతుండటంతో రైతులు లాభసాటిగా భావిస్తున్నారు.

ఎందుకిలా?

పెట్టుబడి తక్కువగా ఉండటం

అదుపులో తెగుళ్ల బెడద

కూలీల అవసరం తక్కువ

కేవలం రైతు దంపతుల శ్రమతోనే పూర్తి సాగు

తక్కువ నీటి వినియోగం

వాతావరణ ప్రతికూల పరిస్థితులు తట్టుకుని నిలబడటం

గిట్టుబాటు ధర

ప్రైవేటు వ్యాపారులు మద్దత ధర మించి కొనుగోలు చేయటం

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు.

'సొంత పొలంతోపాటు కౌలుకు తీసుకొని మొత్తం నలభై ఎకరాల్లో మొక్కజొన్న సాగుకు ఏర్పాట్లు చేస్తున్నా. ఇప్పటికే 15 ఎకరాల్లో విత్తనాలు వేశా. వాణిజ్య పంటల సాగు లాభదాయకంగా లేకపోవటంతో నాలుగేళ్ల నుంచి దీనిపై దృష్టి సారించా. ప్రస్తుతం మొక్కజొన్నకు మార్కెట్ ధర బాగుంది.'

దొబ్బల నరసింహారావు, రైతు, రాఘవాపురం, చింతకాని

'రైతులు గుర్తింపు పొందిన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. దేశంలో కోళ్ల, పశువుల దాణా, స్టార్చ్ ఉత్పత్తులకు మొక్కజొన్నను వినియోగిస్తుండటంతో గిరాకీ పెరిగింది. రబీలో అనుకూల పరిస్థితుల కారణంగా అధిక దిగుబడి వస్తుంది. ప్రకృతి ప్రతికూలతలనూ ఇది తట్టుకుని నిలబడగలదు.' డాక్టర్ కె.రవికుమార్, వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్



# దిల్లీలో ఎన్డీయే నేతల సమావేశం.. పాల్గొన్న సీఎం చంద్రబాబు

దిల్లీ: దిల్లీలో ఎన్డీయే నేతల సమావేశం కొనసాగుతోంది. భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో ఏర్పాటు చేసిన ఈ భేటీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబు, రామ్మోహన్‌నాయుడు సహా పలువురు కేంద్రమంత్రులు, ఎన్డీయే పక్ష నేతలు పాల్గొన్నారు.

దేశంలో తాజా రాజకీయ పరిస్థితులు, ఇటీవల పార్లమెంటు సమావేశాల్లో చోటుచేసుకున్న ఘటనలు, తదుపరి కార్యాచరణపై ఇందులో చర్చించినట్లు తెలుస్తోంది. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారం రేపుతున్నాయి. ఈ విషయంలో మిత్రపక్షాల మధ్య మెరుగైన సమన్వయం సాధించడంతోపాటు కాంగ్రెస్‌కు గట్టిగా సమాధానం చెప్పే అంశంపైనా ఎన్డీయే నేతలు చర్చించారు. జేపీసీ పరిశీలనకు పంపాలని నిర్ణయించిన జమిలి ఎన్నికల బిల్లుపై, వక్ఫ్‌చట్ట సవరణ బిల్లుపై అనుసరించాల్సిన వ్యూహాలు, దిల్లీ సరిహద్దుల్లో అన్నదాతల నిరసనలు, వచ్చే ఏడాదిలో దిల్లీ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో కూటమి పక్షాల మధ్య సీట్ల సర్దుబాటు అంశంపైనా చర్చ జరిపినట్లు సమాచారం.

# భారత జాతి గర్వించదగిన నేత వాజ్‌పేయీ: చంద్రబాబు



వాజ్‌పేయీ దూరదృష్టి వల్లే మన దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. వాజ్‌పేయీ జయంతి సందర్భంగా 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. "భారతజాతి గర్వించదగిన నేత వాజ్‌పేయీ.

ఆయన దూరదృష్టి వల్లే నేడు మన దేశం ప్రపంచదేశాలతో పోటీ పడుతోంది. దేశం గురించి ఆలోచించే తీరు విలక్షణమైనది. సంస్కరణల ప్రతిపాదనలపై వాజ్‌పేయీ స్పందించిన తీరు ఎన్నటికీ మరచిపోలేను. ఆయనకు ఘన నివాళి అర్పిస్తున్నాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.



# విజయవాడలో వాజ్‌పేయీ విజ్ఞాన కేంద్రం.. ప్రారంభించిన ఎమ్మెల్యేలు మండలి, సుజనా

విజయవాడ: నగరంలోని ప్రసిద్ధ రామ్మోహన్ గ్రంథాలయంలో వాజ్‌పేయీ విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కృష్ణా జిల్లా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి.. ఈ విజ్ఞాన కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మహాత్మాగాంధీ పాదస్పర్శతో పునీతమైన రామ్మోహన్ గ్రంథాలయంలో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయడం పట్ల ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు. ఈ గ్రంథాలయం కొన్నాళ్లుగా వైభవాన్ని కోల్పోయిందని, మళ్లీ నిర్వాహకులు పూర్వ వైభవం తేవడం అభినందనీయమని చెప్పారు. రాజకీయాలకు ఔన్నత్యం తెచ్చిన గొప్ప నాయకుడు వాజ్ పేయీ.. ఆయన పేరును ఈ విజ్ఞాన కేంద్రానికి పెట్టడం మంచి పరిణామమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ.. 117 ఏళ్ల చరిత్ర కలిగిన గ్రంథాలయానికి పూర్వవైభవం తేవడం గొప్ప విషయమన్నారు.

విజయవాడ తన జన్మభూమి అని.. హైదరాబాద్ వెళ్లినా, అమెరికా వెళ్లినా అవన్నీ కర్మభూములేనని సుజనా అన్నారు. ఈ గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు సహకారం అందిస్తానని సుజనా చౌదరి హామీ ఇచ్చారు.

# ఏపీలో కూడా టికెట్ల ధరల పెంపునకు అనుమతి ఇవ్వొద్దు.. ఏపీ సీఎం చంద్రబాబుకు సీపీఐ లేఖ



తెలంగాణ తరహాలో ఏపీలో కూడా టికెట్ల ధరల పెంపునకు, బెనిఫిట్ షోలకు అనుమతులు ఇవ్వద్దని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. పెద్ద హీరోల సినిమాలకు టికెట్ల ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచడం పరిపాటిగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది ప్రేక్షకుల జేబులు కొల్లగొట్టడమేనని అభిప్రాయపడ్డారు. అందుకే టికెట్ ధరలను పెంచడం, బెనిఫిట్ షోలకు అనుమతించే విధానాలను సీపీఐ తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి కె.రామకృష్ణ ఓ లేఖ రాశారు. పెద్ద హీరోల సినిమాలకు టికెట్ల ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచుతూ, ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతినిస్తూ జీవోలు జారీ చేడయం పరిపాటిగా మారిందని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఇది ప్రేక్షకుల జేబులను కొల్లగొట్టడమే అని అభిప్రాయపడ్డారు. పెద్ద హీరోల సినిమాలను కొన్ని నిర్మాణ సంస్థలు పోటీపడి వందల కోట్ల రూపాయల భారీ బడ్జెట్లతో, ఏళ్ల తరబడి చిత్రీకరిస్తున్నాయని అన్నారు. కనీస సామాజిక స్పృహలేని ఆయా సినిమాల కలెక్షన్ల కోసం టికెట్ ధరలను పెంచాల్సిందిగా, ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతినివ్వాల్సిందిగా నిర్మాణ సంస్థలు ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నాయని పేర్కొన్నారు. సినిమా రంగానికి తలొగ్గి ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా టికెట్ల ధరలను విపరీతంగా పెంచుకునేందుకు, బెనిఫిట్ షోలు వేసేందుకు అనుమతించాయని చెప్పారు. ఈ విధానాలను సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ చనిపోవడంపై రామకృష్ణ విచారం వ్యక్తం చేశారు. రేవతి కుమారుడు శ్రీతేజ ఆపస్మారక స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడని అన్నారు. ఈ దుర్ఘటన తర్వాత ఇకపై తెలంగాణలో సినిమా టికెట్ల ధరలను పెంచబోమని, ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతి ఇవ్వబోమని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని తెలిపారు. తెలంగాణ తరహాలో ఏపీలో కూడా సినిమా టికెట్ల ధరలు పెంచబోమని, ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతి ఇవ్వబోమనే ప్రకటన చేయాలని కోరారు.

# రైతులకు మరింత మేలు చేకూర్చే విధంగా కార్యక్రమాలు: మంత్రి అచ్చెన్నాయుడు



విజయవాడ: సహకార శాఖ ద్వారా రైతులకు మరింత మేలు చేకూర్చే కార్యక్రమాలు చేపడతామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర సహకార శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన 'సహకారంతో సంవృద్ధి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా 10,212 నూతన బహుళ ప్రయోజన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు, మత్స్యకార సహకార సంఘాలను 2023 నుంచి రిజిస్టర్ చేసి నిర్వహిస్తున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 932 డెయిరీ సహకార సంఘాల ద్వారా రోజుకు 1,60,000 లీటర్ల పాల సరఫరా జరుగుతోందని వెల్లడించారు. తద్వారా 45,000 కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని పేర్కొన్నారు.




కజకిస్థాన్‌లో ఘోర ప్రమాదం జరిగింది. అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ ప్రయాణికుల విమానం అక్టౌ సమీపంలో కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో పలువురు మృతి చెందినట్లు సమాచారం. ప్రమాద సమయంలో విమానంలో 67 మంది ప్రయాణికులు, ఐదుగురు సిబ్బందితో కలిపి మొత్తం 72 మంది ఉన్నారు. వీరిలో ఆరుగురు ప్రాణాలతో బయటపడినట్లు కజకిస్థాన్ ఆరోగ్య శాఖ మంత్రి వెల్లడించారు. అజర్‌బైజాన్‌లోని బాకు నుంచి బయల్దేరిన ప్రయాణికుల విమానం రష్యా రిపబ్లిక్ చెచెన్యా రాజధాని గ్రోజ్నీ వైపు వెళ్తుండగా ప్రమాదానికి గురైంది. గ్రోజ్నీలోని దట్టమైన మంచు కారణంగా దానిని దారి మళ్లించారు. ఈ క్రమంలోనే అక్టౌ ఎయిర్‌పోర్ట్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు ప్రయత్నిస్తూ ప్రమాదవశాత్తూ కూలిపోయింది. దాంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదానికి ముందు ఎయిర్‌పోర్ట్‌పైన విమానం పలుమార్లు గిరగిరా తిరిగి, నేల కూలిందని స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ దృశ్యాలు నెట్టింట్లో వెలుగులోకి వచ్చాయి.




# మానవ అక్రమ రవాణా.. కెనడా కాలేజీలపై ఈడీ నిఘా


కెనడా సరిహద్దుల నుంచి అమెరికాలోకి భారతీయులను అక్రమంగా తరలించేందుకు సంబంధించి డబ్బులు చేతులుమారిన మనీలాండరింగ్ కేసులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేస్తోంది. ఇందులోభాగంగా కెనడాలోని కొన్ని కాలేజీలు, భారత సంస్థల పాత్రపై విచారణ చేపట్టినట్లు దర్యాప్తు సంస్థ వెల్లడించింది. 2022 జనవరి 19న గుజరాత్‌కు చెందిన ఓ కుటుంబం కెనడా సరిహద్దు నుంచి అక్రమంగా అమెరికాలోకి ప్రవేశిస్తున్న సమయంలో తీవ్రమైన శీతల వాతావరణం కారణంగా మరణించిన విషయం తెలిసిందే. ఈ కేసును ఆధారంగా చేసుకొని ఈడీ దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు భవేష్ పటేల్‌తో పాటు మరికొందరిపైనా మనీలాండరింగ్ చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది. నిందితులు మానవులను అక్రమంగా తరలించే సంస్థలతో కలిసి కుట్ర పన్ని.. భారత ప్రజలకు మాయమాటలు చెప్పి వారిని దేశ సరిహద్దులు దాటిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాంటివారిని కెనడా మీదుగా అమెరికాకు అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. ఇందుకోసం కెనడా, అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలని, విదేశాల్లో స్థిరపడాలని కోరుకునే భారతీయులను ట్రాప్ చేస్తున్నట్లు తమ దర్యాప్తులో కనుగొన్నామన్నారు. ఈ వ్యవహారంలో ఒక్కో వ్యక్తి నుంచి రూ.55 – రూ.60 లక్షల వరకు వసూలుచేసినట్లు వెల్లడించారు. కానీ, విద్యార్థి వీసాపై కెనడాకు వెళ్లినవారు అక్కడి విశ్వవిద్యాలయాల్లో చేరట్లేదన్నారు. దీంతో కాలేజీలు వారి నుంచి తీసుకున్న అడ్మిషన్ ఫీజును తిరిగి ఆయా వ్యక్తుల ఖాతాల్లో జమ చేసేవారని తెలిపారు. అలా వెళ్లినవారు చట్టవిరుద్ధంగా కెనడా యూఎస్ సరిహద్దును దాటుతున్నారని తెలిపారు. దీనికి సంబంధించిన సమాచారం కోసం ఈ కేసులో ముంబయి, నాగ్‌పూర్, గాంధీనగర్ వంటి 8 ప్రదేశాల్లో సోదాలు చేపడుతున్నట్లు ఏజెన్సీ తెలిపింది. విదేశాల్లోని యూనివర్సిటీల్లో భారతీయులకు ప్రవేశం ఇప్పించడానికి ముంబయి, నాగ్‌పూర్ ఉన్న రెండు సంస్థలు పని చేస్తున్నట్లు గుర్తించామని అధికారులు పేర్కొన్నారు. వీరు ఏటా దేశంలోని వివిధ కళాశాలల నుంచి సుమారు 35వేల మంది విద్యార్థులను దేశం దాటిస్తున్నారని తెలిపారు.



# భవానీ దీక్షల విరమణ.. ఇంద్రకీలాద్రిపై భారీ రద్దీ

విజయవాడ: భవానీ దీక్షల విరమణతో విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై భారీగా రద్దీ నెలకొంది. దీక్షల విరమణ చివరి రోజు కావడంతో పెద్ద ఎత్తున భవానీలు తరలివస్తున్నారు. ఆలయ అధికారులు అన్ని క్యూ లైన్లలోనూ ఉచితంగానే దుర్గమ్మ దర్శనానికి అనుమతిస్తున్నారు. క్యూలో ప్రవేశించిన వారికి దర్శనం పూర్తయ్యేసరికి 2నుంచి 3గంటల సమయం పడుతోంది. జగన్మాత నామస్మరణతో ఇంద్రకీలాద్రి ప్రతిధ్వనిస్తోంది. అమ్మవారి దర్శనం అనంతరం భవానీ ఘాట్, పున్నమి ఘాట్, సీతమ్మవారి పాదాల సమీపంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక కేశఖండనశాల వద్ద దీక్షాదారులు తలనీలాలు సమర్పిస్తున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఉచిత అన్నప్రసాదం అందిస్తున్నారు. ఇవాళ పూర్ణాహుతితో భవానీ దీక్షల విరమణ కార్యక్రమం పరిసమాప్తం కానుంది. తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తరలివస్తోన్న భవానీలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఆలయ ఈవో రామారావుతోపాటు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, ఇతర శాఖల అధికారులు మోడల్ గెస్ట్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి భక్తుల రద్దీ, దర్శనాలు, ఇతర సౌకర్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# వాజ్‌పేయి వారసత్వాన్ని మోదీ స్వీకరించారు



విశాఖపట్నం, డిసెంబర్ 25: మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని సుపరిపాలన దినోత్సవంగా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని మిజోరాం రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తుగా.. భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించుకున్నామని తెలిపారు. వాజ్‌పేయి ఎప్పుడూ నిజాయితీగానే వ్యవహరించారని.. అందుకే ఒక్క ఓటు తో ప్రధాని పదవిని చేజార్చుకొన్నారన్నారు. కార్గిల్ యుద్ధంలో పాక్‌పై విజయం సాధించడానికి కారణం వాజ్‌పేయి అని తెలిపారు. ఆయన హయాంలో నాలుగు మెట్రో నగరాల మధ్య... నాలుగు లైన్ల జాతీయ రహదారిని వేశారన్నారు. ఏపీలో ఇచ్ఛాపురం నుంచి తడ వరకు వేయి కిలో మీటర్ల రోడ్లు వేశారని దీనితో భూములు విలువ పెరిగిందని చెప్పారు. సుదీర్ఘ కాలం పాటు వాజ్‌పేయి ప్రతిపక్షంలోనే ఉన్నారన్నారు. 1975 లో దేశంలో అత్యవసర పరిస్థితిని ఇందిరా విధించారని.. ప్రతి పక్ష నేతలను జైల్లో పెట్టారన్నారు. అప్పుడు దేశంలో పత్రికా స్వాతంత్ర్యం లేదని.. ఎన్నో ఆంక్షలు పెట్టారన్నారు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని వాజ్‌పేయి ఎంతో చాకచక్యంగా నడిపారన్నారు. మొట్టమొదటి సారిగా కేంద్రంలో గిరిజన సంక్షేమ శాఖను ఏర్పాటు చేశారని వెల్లడించారు. వాజ్‌పేయి హయంలో ఎటువంటి హింసకు తావు లేకుండా మూడు రాష్ట్రాలు ఏర్పాటు చేశారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన ఏ విధంగా జరిగిందో అందరూ చూశారన్నారు. చంద్రయాన్ ప్రాజెక్టులకు పునాది వేసింది కూడా వాజ్‌పేయి అని తెలిపారు. టెలీకమ్యూనికేషన్ అభివృద్ధి, మొబైల్ టెక్నాలజీ విస్తరణ వాజ్‌పేయ్‌తో నాంది పలికిందన్నారు. వాజ్‌పేయి హయంలో పోఖ్రాన్ అణుపరీక్షలు నిర్వహించారన్నారు. ఈ అణుపరీక్షలు తర్వాత అమెరికా ఎన్నో ఆంక్షలు పెట్టారని.. అయితా వాటిని అధిగమించామన్నారు. ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసి పాక్ ప్రేరిపిత ఉగ్రవాదులకు గట్టి గుణపాఠం చెప్పామన్నారు. కొవిడ్ హయంలో ఎన్నో దేశాలకు వాక్సిన్ సరఫరా చేశామని... భారత విశ్వ మిత్ర దేశంగా మారిందని చెప్పుకొచ్చారు. వాజ్‌పేయి వారసత్వాన్ని ప్రధాని మోదీ స్వీకరించారని తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ ఐదవ స్థానంలో ఉంది.. భవిష్యత్తులో మూడో స్థానానికి చేరుకుంటుందని తెలిపారు. 2047కి వికసిత్ భారత్ కావాలని.... ఈ లక్ష్య సాధనకు అందరూ కృషి చేయాలని మిజోరాం రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు కోరారు.




## అంబానీ ఈవెంట్లో శ్రీదేవి చిన్నకూతురు స్టన్నింగ్

అంబానీ కుటుంబం నిర్వహించిన గ్రాండ్ NMACC ఆర్ట్స్ కేఫ్ ప్రివ్యూ (ఆర్ట్ ఎగ్జిబిషన్) ఈవెంట్‌కు బాలీవుడ్ ప్రముఖులు మొత్తం తరలివచ్చారు. కింగ్ ఖాన్ షారూఖ్ సహా కత్రినా కైఫ్, జాన్వీ కపూర్, సుహానా ఖాన్ , ఖుషీ కపూర్ వంటి అందాల కథానాయికలు ఈవెంట్లో అబ్బురపరిచారు. వేడుక ఇన్ సైడ్ ఫోటోలు ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. ఈవెంట్ నుంచి ఇంతకుముందే జాన్వీకపూర్ స్పెషల్ లుక్ ఇంటర్నెట్ లో వైరల్ అయింది. ఇంతలోనే ఖుషీ కపూర్ లుక్ కూడా రిలీజైంది. అక్కా చెల్లెళ్లు ఒకరితో ఒకరు పోటీపడుతూ అల్ట్రా మోడ్రన్ దుస్తుల్లో ప్రివ్యూలో అదరగొట్టారు. ముఖ్యంగా ఖుషి కపూర్



తన సోదరి జాన్వీ కంటే భిన్నమైన లుక్ తో కనిపించింది. 60ల నాటి రోజులు గుర్తుకొస్తున్నాయి! అనే క్యాప్షన్ తో ఈ ఫోటోలను ఖుషి స్వయంగా తన ఇన్ స్టాలో షేర్ చేయగా అవి వైరల్ గా మారుతున్నాయి. వేడుకలో వెన్యూ వద్ద ఖుషి రకరకాల భంగిమల్లో చెలరేగిపోయింది. ఖుషీ నీలం రంగు దుస్తులు ధరించి థై హై ఎలివేషన్ తో కనిపించింది. ఒక చిన్న నల్ల బ్యాగ్‌ని తనతో పాటే తీసుకుని వచ్చింది. సోదరి జాన్వీ పింక్ డిజైనర్ డ్రెస్ లో దేవతను తలపించగా, ఖుషి పూర్తిగా బాస్ వైబ్స్ తో ఆకట్టుకుంటుంది. ఎప్పటిలాగే ఈవెంట్లో ఓర్రీ అలియాస్ ఓర్హాన్ అవ్రతమణితో భామలంతా ఫోటోలు దిగారు. జాన్వీ– ఖుషి కపూర్ కూడా అతడితో ఫోటోలు దిగగా, కత్రిన, సుహానా, సనయా లాంటి తారలు ఓర్రీతో ఫోటోలు దిగారు. అంబానీ కోడలు రాధిక మర్చంట్, కుమార్తె ఇషా అంబానీతో కలిసి ఓర్రీ పోజులిచ్చాడు. ఇదే వేడుకలో మాధురీ దీక్షిత్ సహా భర్త డాక్టర్ శ్రీరామ్ నీనే, అనన్య పాండే, షాన్యా కపూర్, వారి తల్లులు భావనా పాండే, మహీప్ కపూర్, కరణ్ జోహార్, అర్జున్ కపూర్ తదితరులు ఉన్నారు. విద్యాబాలన్ – సిద్ధార్థ్ రాయ్ కపూర్ జంట వేడుకలో సందడి చేసారు.

## సీరత్ కపూర్.. లుక్స్ తోనే సెగలు పుట్టిస్తోంది

సీరత్ కపూర్ ఇటీవల కాలంలో సినిమాల్లో ఎక్కుగా కనిపించకపోయినా కూడా తన గ్లామర్ ఫోటోషూట్లతో యూత్‌కి ప్రత్యేక ఆకర్షణగా మారింది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో "ఫైర్ అండ్ ఐస్ లీథల్ కాంబినేషన్" అనే క్యాప్షన్‌తో పోస్ట్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. గోల్డెన్ గౌన్‌లో మెరిసిపోతూ, తన అద్భుతమైన ఎక్స్‌ప్రెషన్లతో యూత్‌ని మంత్ర ముగ్ధులను చేసిన ఈ అందాల భామ, తన గ్లామర్ ప్రెజెన్స్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సీరత్ ఈ లుక్‌తో మరింత పాపులారిటీని సాధిస్తూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా నిలుస్తోంది. సీరత్ కపూర్ కెరీర్ గురించి చెప్పుకోవాలంటే, ఈ అమ్మడు సినిమాల్లో తన ప్రస్థానాన్ని తెలుగులో ప్రారంభించింది. 2014లో వచ్చిన 'రన్ రాజా రన్' చిత్రం ద్వారా టాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది.



మొదటి సినిమా నుంచే తన పెర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకొని మంచి గుర్తింపును తెచ్చుకుంది. ఈ చిత్రంలో తన నైజమైన నటనతో యువతకు క్రష్‌గా మారిపోయిన సీరత్, తరువాత 'టైగర్', 'కృష్ణ అండ్ హిజ్ లీలా', 'మా వినతా' వంటి చిత్రాల్లో కూడా నటించి తన ప్రతిభను చూపించింది. ఇటీవల సీరత్ 'భామాకలాపం 2', 'మనమే' వంటి చిత్రాల్లో కనిపించి తన యాక్టింగ్ స్కిల్స్‌ను మరింత మెరుగుపర్చింది. తక్కువ సమయంలోనే మంచి పేరు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ, సోషల్ మీడియాలో సైతం యమ యాక్టివ్‌గా ఉంటుంది. ప్రస్తుతం సీరత్ కపూర్ తన అందంతో పాటు, అభినయంతో కూడా ప్రేక్షకుల్ని ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. ఈ మధ్యకాలంలో ఫోటోషూట్ల ద్వారా కూడా సీరత్ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. బోల్డ్ మరియు గ్లామర్ లుక్‌తో యూత్‌కి ఫ్యాషన్ ఐకాన్‌గా నిలుస్తున్న సీరత్, తన క్రేజ్‌ను మరింత పెంచుకుంటూ టాలీవుడ్‌లో మంచి అవకాశాల కోసం ఎదురుచూస్తుంది. మరి ఆమె అందానికి తగ్గట్టుగా ఏమైనా కొత్త అవకాశాలు వస్తాయో లేదో చూడాలి.


## చెన్నైలో 'బాణం' గురి పెట్టిన వేదిక



నారా రోహిత్ సరసన 'బాణం' చిత్రంలో నటించింది వేదిక. లారెన్స్ మాస్టర్ హారర్ మూవీ 'కాంచన'లోను నటించింది. తెలుగు, తమిళంలో అవకాశాలు అందుకున్న ఈ బ్యూటీ ఆశించిన స్టార్ డమ్ ని అందుకోకపోయినా నటిగా కెరీర్ పరంగా డోఖా లేని స్థితిలో ఉందిప్పుడు. వేదిక కొంత గ్యాప్ తర్వాతా కంబ్యాక్ అయిన తీరు ఫ్యాన్స్ ని ఆశ్చర్యపరుస్తోంది. తాజాగా చెన్నైలో ఓ ఈవెంట్ కి అటెండయిన వేదిక అల్ట్రా గ్లామరస్ స్టిల్స్ వెబ్ లో వైరల్ గా మారుతున్నాయి. ఈ ఫోటోలు చూశాక.. వజ్రాన్ని సాన బట్టే కొద్దీ మెరుపు పెరుగుతుంది! అన్న చందంగా వయసు పెరిగే కొద్దీ వేదిక అల్ట్రా గ్లామరస్ గా తయారవుతోంది అంటూ యూత్ కితాబిచ్చేస్తున్నారు. ఇటీవలే వేదిక నటించిన 'ఫియర్' చిత్రం తమిళం, తెలుగులో విడుదలైంది. ఈ సినిమాలో వేదిక నటనకు ప్రశంసలు కురిసాయి. ఒకే ఏడాదిలో ఐదు సినిమాల్లో నటించానని, ఫియర్ చిత్రంతో సంవత్సరాన్ని ముగించడం గొప్ప బహుమతి అని అంది వేదిక. దేవుని దయతో కష్టపడి పని చేస్తే మాయాజాలం జరుగుతుంది. 2023 నుండి నా ప్రయాణంలో చాలా శ్రమించాను. నన్ను ఆదరించిన నా అభిమానులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు. ఒక సంవత్సరంలో ఐదు రిలీజ్‌లతో మీ ముందుకు రావడం నిజంగా ప్రత్యేకమైనది. ప్రతి ప్రాజెక్ట్ నటన పరంగా సవాల్ విసిరినప్పుడు బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించే అకాశం కలిగినప్పుడు ఆనందం కలుగుతుంది" అని కూడా వేదిక తెలిపింది. ఇదే ఊపు నన్ను 2025లో మరింత ఉన్నత స్థాయికి చేరుస్తుందని ఆశిస్తున్నానని కూడా అంది. తాజాగా విడుదలైన ఫియర్ మానసిక ఆరోగ్య సమస్యలపై తెరకెక్కిన చిత్రం. చిన్నప్పటి నుంచి మానసిక సమస్యలతో సతమతమయ్యే సింధు పాత్రలో వేదిక నటించింది.

తనను చంపడానికి ఎవరో వస్తున్నారని భయపడే పాత్ర అది. కథనం ముందుకు సాగేకొద్దీ కొద్దీ రహస్యం మరింత ఉత్కంఠ పెంచుతుంది. డిసెంబర్ చివరిలో వేదిక నటించిన మరో తమిళ చిత్రం విడుదలయ్యే ఛాన్సుందని సమాచారం.

## బజార్ ఇండియాపై చురకత్తిలా పటౌడీ బ్యూటీ!




చురకత్తితో గుచ్చితో గుండెలోతుల్లోకి దిగాల్సిందే. చురకత్తి పదును అలాంటింది. మరి అందం అనే చురకత్తితో గుచ్చితే! ఆ గాయం పోటు ఇంకెంత లోతుగా వెళ్తుందో చెప్పాల్సిన పనిలేదు. తాజాగా పటౌడీ వారసురాలు సారా అలీఖాన్ అలాంటి పోటుకే కుర్రాకారుని గురి చేస్తుంది. ఇదిగో అమ్మడిలా బజార్ ఇండియా కవర్ పేజీపై చెల రేగింది. పాల నురుగుల సౌందర్యం పై బ్లాక్ అండ్ బ్లాక్ దుస్తుల్లో తళుక్కున మెరిసింది. నలుపు రంగు ప్యాంట్ పై టాప్ లో మ్యాచింగ్ పీస్ దరించి క్లీవేజ్ బ్యూటీని హైలైట్ చేసింది. బ్యాక్ ను డిజైనర్ కోట్ తో కవర్ చేసింది. చేతిలో హ్యాండ్ బ్యాగ్ చైర్ పై కాలు చాపి స్టైలిష్ గా కెమెరాకి ఫోజులిచ్చింది. మరో పిక్ లో మోడ్రన్ బ్యూటీలో ఫోజులిచ్చింది. సారా హెయిర్ స్టైల్..మ్యాకప్ ఇతర అలంకరణ ప్రతీది మరింత అందంగా తీర్చిదిద్దాయి. సారా స్ట్రెయిట్ ఎటాకింగ్ కుర్ర కారు హృదయాలు ఛిద్రమవ్వడం ఖాయం. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇక సారా అభిమానులు అమ్మడి అందాన్ని ఆకాశానికి ఎత్తకుండా ఉండలేకపోతున్నారు. లుక్స్ గార్జియస్...బ్యూటీఫుల్ లేడీ అంటూ తమదైన శైలిలో కామెంట్ల వర్షం గుప్పిస్తున్నారు. ఇక సారా కెరీర్ సంగతి చూస్తే బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్ లతో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. గ్యాస్ లైట్..జర్ హట్ కే జర బచ్ కే..యే వతన్ మేరా వతన్ లాంటి విజయాలతో రెట్టింపు ఉత్సాహంలో ఉంది.

ప్రస్తుతం అమ్మడి ఖాతాలో హిందీలోనే ఐదారు సినిమాలు రెడీగా ఉన్నాయి. అవన్నీ షూటింగ్ దశలో ఉన్నాయి. అవి గాక కొత్త ఛాన్సులు క్యూలో ఉన్నాయి. నటిగా డే బైడే ఫైన్ అవుతుంది. టాలీవుడ్ లో నూ లాంచ్ అవ్వాలని ప్రయత్నాలు చేస్తోంది. సరైన ఛాన్స్ వస్తే దూకడానికి సిద్దంగానే ఉంది. ఇప్పటికే డాడ్ సైఫ్ అలీఖాన్ దేవరతో లాంచ్ అయిన సంగతి తెలిసిందే.

## మహేష్ కోసం ముంబై కూడా అరుస్తుందా!


తెలుగు రాష్ట్రాల్లో స్టార్ హీరోల సినిమాలు రిలీజ్ అవుతున్నాయంటే? రెండు..మూడు రోజుల పాటు థియేటర్లలో హడావుడి ఎలా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. అభిమానులతో దద్దరిల్లుతుంది. హీరో టైటిల్ పడగానే విజిల్స్ , కేకలేస్తూ, తెరపైకి కాగితం ముక్కలు ఎగరేస్తూ అభిమానం చాటుకుంటారు. ముందు వరుసలో కూర్చున్న గ్యాంగ్ చేసే రచ్చ అంతా ఇంతా కాదు. ప్రతీ స్టార్ హీరో సినిమాకి తెలుగు రాష్ట్రాల్లో చూసే సన్నివేశమే ఇది. మరి ముంబై థియేటర్లలో కూడా ఓ హీరో విషయంలో ఇలాగే ఉంటుందా? అంటే అవుననే అంటోంది శ్రీలీల. ఇంతకీ ఎవరా హీరో? అంటే ఆ వివరాల్లోకి వెళ్లాల్సిందే. ఆ హీరో ఎవరో కాదు. సూపర్ స్టార్ మహేష్. ఇద్దరు కలిసి గుంటూరు కారంలో నటించిన సంగతి తెలిసిందే.



అయితే ఈ సినిమా తొలి షోని శ్రీలీ ముంబై లోని ఓ థియేటర్లో చూసిందిట. ఆ సినిమా రిలీజ్ సమయానికి ముంబైలో ఉండటంతో? అక్కడ థియేటర్లో చూడాల్సి వచ్చిందని తెలిపింది. కానీ థియేటర్లో మహేష్ బొమ్మ పడగానే అభిమానులంతా ఒక్కసారిగా పైకి లేచి హడావుడి చేసారుట. అభిమానుల కేరింతలతో థియేటర్ దద్దరిల్లిపోయిందని తెలిపింది. ఆ సౌండ్ పొల్యూషన్ కి తన చెవులు మోతెక్కిపోయాయంది. ముంబై థియేటర్లో ఓ తెలుగు హీరో సినిమాకి ఇలాంటి సన్నివేశం చోటు చేసుకుంటుందని అస్సలు ఊహించ లేదంది. దీంతో ముంబైలో కూడా మహేష్ కి అభిమానులు మాములుగా లేరని అర్ధమవుతుంది. మహేష్ ఇంత వరకూ హిందీ సినిమాలు చేయలేదు. కానీ డబ్బింగ్ రూపంలో రిలీజ్ అవుతుంటాయి. ముఖ్యంగా బిజినెస్ మ్యాన్ సినిమా హిందీలో మహేష్ కి మంచి క్రేజ్ ని తెచ్చి పెట్టింది. మహేష్ ఎలివేషన్లు సీన్లు ముంబై ధారావాలోనే షూట్ చేసారు. స్టోరీ అక్కడ బ్యాక్ డ్రాప్ లో సాగడంతో షూటింగ్ అంతా కూడా అక్కడే చేసారు. ఆ సినిమాకి బాలీవుడ్ హీరోయిన్లే కాదు...స్పోర్ట్స్ పర్సన్స్ కూడా అభిమానులుగా మారారు.

## జ్యోతిరాయ్.. కూల్ అండ్ క్లాసీ లుక్

టాలీవుడ్ బ్యూటీ జ్యోతి పూర్వాజ్ తన ప్రత్యేకమైన స్టైల్‌తో సోషల్ మీడియాలో మరొకసారి హల్‌చల్ చేస్తోంది. కారులో కూర్చొని సన్ గ్లాసెస్ తో కూల్ లుక్‌లో దిగిన ఫోటోను ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. సింపుల్ ఎమోజీలతో క్యాప్షన్ ఇస్తూ ఈ ఫోటోలో తన గ్లామర్‌ను హైలెట్ చేస్తూ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. కారులో కూర్చుని సాలిడ్ పోజ్ ఇస్తూ తీసుకున్న ఈ ఫోటోలో ఆమె ప్రత్యేకమైన అందంతో ప్రేక్షకులను కట్టిపడేస్తున్నారు. పెర్ఫెక్ట్ స్టైలింగ్‌తో తీసుకున్న ఈ ఫోటోలో జ్యోతి వేసుకున్న క్యూట్ డ్రెస్ ఆమె గ్లామర్‌ను మరింత హైలైట్ చేస్తోంది. సన్‌గ్లాసెస్, కాస్ట్యూమ్స్ తీరుతో మోడ్రన్ లుక్‌లో కనువిందు చేస్తోన్న ఆమె ప్రత్యేక ఫ్యాన్ బేస్‌ను కలిగి ఉంది. హైలైట్‌గా నిలుస్తోన్న ఆమె డ్రెస్సింగ్ సెన్స్, కూల్ అండ్ క్లాసీ లుక్స్‌తో అభిమానుల మనసును దోచుకుపోతున్నారు. ఈ ఫోటోకు ఇన్‌స్టాలో 10,000కుపైగా లైకులు, 100కు పైగా కామెంట్లు రావడం చూస్తే



ఆమె పాపులారిటీ మరింత పెరుగుతున్నట్లు అనిపిస్తోంది. జ్యోతి పూర్వాజ్ తరచూ ఇలాంటి గ్లామరస్ ఫోటోషూట్లు చేస్తూ ఫ్యాషన్ ప్రపంచంలో తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. సాధారణ గ్లామర్ లుక్‌లోనే కాకుండా, కారు బ్యాక్‌డ్రాప్‌లో ఇలాంటి స్టైలిష్ ఫోటోలు ఆమెను మరింత ప్రత్యేకంగా చూపిస్తున్నాయి. జ్యోతి పూర్వాజ్ కెరీర్ టెలివిజన్ ద్వారా మొదలైంది. టీవీ సీరియల్స్‌లో వివిధ రకాల పాత్రలు పోషిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. చిన్న తెరపై ఆమె నటన అందరినీ ఆకట్టుకుంది. ఈ అవకాశాలు ఆమెకు సినిమా ఇండస్ట్రీలో కూడా అడుగుపెట్టడానికి దారి తీశాయి. ఆ తర్వాత తెలుగు సినిమాల్లో సపోర్టింగ్ రోల్స్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. కేవలం గ్లామర్ పాత్రలకే కాకుండా, సీరియస్ పాత్రలతో కూడా మంచి అభినందనలు పొందారు.



## మెదక్ చర్చికి దేశస్థాయిలో గుర్తింపు

మెదక్: వందేళ్లు పూర్తిచేసుకున్న మెదక్ చర్చికి దేశస్థాయిలో గుర్తింపు ఉందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా మెదక్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు విజ్ఞప్తి మేరకు మెదక్ చర్చి అభివృద్ధికి నిధులు కేటాయించామని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇక్కడికి వచ్చానని.. సీఎం హోదాలో మళ్లీ వస్తానని అప్పట్లో మాటిచ్చానని రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లలో దళిత, గిరిజన క్రైస్తవులకు అత్యధికంగా లబ్ధి చేకూరుతుందన్నారు. ఆరోగ్యశ్రీ సాయాన్ని రూ.10లక్షలకు పెంచామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేశామని సీఎం వివరించారు.



## ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకున్న సీఎం రేవంత్

ఏడుపాయల: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మెదక్ జిల్లాలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా ఏడుపాయలలో వనదుర్గామాతను ఆయన దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎం వెంట మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పలువురు ఎమ్మెల్యేలు ఉన్నారు. జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించనున్నారు.



## శ్రీతేజ్ కుటుంబానికి రూ.2కోట్ల సాయం

హైదరాబాద్: సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో బాధిత కుటుంబానికి రూ.2కోట్ల సాయం అందజేయనున్నట్లు నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించిన అనంతరం ఆయన ప్రకటించారు. నటుడు అల్లు అర్జున్ తరపున రూ.కోటి.. పుష్ప2 నిర్మాతలు, దర్శకుడు సుకుమార్ చెరో రూ.50లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సంబంధిత చెక్కులను దిల్ రాజుకు అల్లు అరవింద్ అందజేశారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, పుష్ప 2 నిర్మాత రవిశంకర్‌తో కలిసి అల్లు అరవింద్ కిమ్స్ ఆస్పత్రికి వెళ్లారు. శ్రీతేజ్‌ను ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బాలుడు తండ్రి భాస్కర్‌తో మాట్లాడారు. అనంతరం అల్లు అరవింద్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు.



## అల్లు అర్జున్ ఎపిసోడ్ వెనక చాలా అనుమానాలు..

హైదరాబాద్: కాంగ్రెస్ నేతలకు అంబేడ్కర్ గురించి మాట్లాడే అర్హత లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు.

"ఎన్టీఆర్ మార్గ్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి తాళాలు వేశారు. ఆయన చరిత్ర తెలిపేలా ఉన్న గదుల్లోకి వెళ్లనివ్వడం లేదు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి ఒక్కసారి కూడా అక్కడికి వెళ్లలేదు. భాజపా ఒత్తిడి మేరకు గత భారాస ప్రభుత్వం ఆ విగ్రహ నిర్మాణం పూర్తి చేసింది. అంబేడ్కర్‌కు సంబంధించిన పంచ తీర్థాలను రాహుల్ గాంధీ దర్శనం చేస్కోవాలి. అల్లు అర్జున్ ఎపిసోడ్ వెనక చాలా అనుమానాలు వస్తున్నాయి. సినీ పరిశ్రమ ఆంధ్రాకు పోవాలని కాంగ్రెస్ నాయకులు కోరుకుంటున్నారు.

ఇండస్ట్రీ ఆంధ్రాకు తరలివెళ్తే తెలంగాణకే నష్టం. మంత్రులు, కాంగ్రెస్ నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుకుండా వారి అధిష్ఠానం అదుపులో పెట్టాలి" అని బండి సంజయ్ అన్నారు.

## ఫార్ములా ఈ-రేసు కేసు.. దాన కిశోర్ వాంగ్మూలం నమోదు



హైదరాబాద్: ఫార్ములా ఈ-రేసు కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఫిర్యాదుదారుడు, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు నమోదు చేశారు. దీని ఆధారంగా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ , పురపాలకశాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌కు నోటీసులిచ్చే అవకాశం ఉంది. ఈమేరకు ఏసీబీ సిద్ధమవుతోంది. ఫార్ములా ఈ-రేసు నిర్వహణ కోసం నిబంధనలకు విరుద్ధంగా విదేశీసంస్థకు సొమ్ము చెల్లించారంటూ దానకిశోర్ ఏసీబీకి ఈ ఏడాది అక్టోబరు 18న ఫిర్యాదు చేశారు. ప్రభుత్వానికి రూ.54.88 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. భారాస హయాంలో పురపాలకశాఖ మంత్రిగా వ్యవహరించిన కేటీఆర్‌ను ప్రధాన నిందితుడి (ఏ1)గా పేర్కొంటూ తెలంగాణ ఏసీబీ ఇటీవల కేసు నమోదు చేసింది. పురపాలకశాఖ అప్పటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ (ఏ2), హెచ్‌ఎండీఏ అప్పటి చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్‌రెడ్డి(ఏ3)లనూ ఎఫ్ఐఆర్‌లో చేర్చింది.

## కుంభమేళా నిర్వహించడం రాకపోతే చెప్పండి.. సాయం చేస్తాం: అఖిలేశ యాదవ్

సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ భాజపాపై విమర్శలు గుప్పించారు. భాజపా నేతలు డబ్బు సంపాదించడంలో, ఎన్నికల ప్రణాళికల్లో బిజీగా ఉండి.. మహా కుంభమేళా కు జరుగుతున్న ఏర్పాట్లలో పాల్గొనలేకపోతున్నారని అఖిలేష్ విమర్శించారు. కుంభమేళాకు సమయం సమీపిస్తున్నా భక్తుల భద్రతకు సరైన సౌకర్యాలు కల్పించడంలో అలసత్వం వహిస్తున్నారని పేర్కొన్నారు. వారికి కుంభమేళాను నిర్వహించడం రాకపోతే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సహాయం చేయడానికి తమ పార్టీ సిద్ధంగా ఉందని అన్నారు. మహా కుంభమేళాకు చేయాల్సిన ఏర్పాట్లలో అధికారుల సమన్వయలోపం వల్ల భద్రతాపరమైన ఏర్పాట్లు ఆలస్యమవుతున్నాయని ఆయన ఆరోపించారు. స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యాలు, ఇతర అవసరాల కల్పనను యోగి ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదన్నారు. అధికారులు వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కోరారు. ఏర్పాట్లలో ఆలస్యం జరగకుండా ఉండేందుకు తమ నేతలు ప్రభుత్వానికి సహకరిస్తారన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని తాము కోరుకుంటున్నామన్నారు. 'మహాదాని' పరిపాలకుడు హర్షవర్ధనుడి విగ్రహం తొలగించడంలో ఆత్రుత ప్రదర్శించిన భాజపా ప్రభుత్వం.. ఇప్పుడు మాత్రం అదే వేగాన్ని ఎందుకు కనబరచడం లేదని విమర్శించారు. ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ఈ మహా కుంభమేళా కొనసాగనుంది. ప్రతి 12 సంవత్సరాలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా కోట్లాది మంది యాత్రికులు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటారు. దాదాపు 45 కోట్ల మంది యాత్రికులు, సాధువులు, సన్యాసులు, పర్యటకులు రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.



## ట్రంప్‌ను తలచుకొని.. హిమఖండం గజగజ

అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కన్ను గ్రీన్‌ల్యాండ్‌పై పడటంతో డెన్మార్క్ అప్రమత్తమైంది. ఈ ప్రాంతం రక్షణకు ప్రత్యేక ఏర్పాట్లను చేస్తోందని బీబీసీ కథనంలో పేర్కొంది. ఇప్పటికే 'మేము విక్రయానికి లేము' అని గ్రీన్‌ల్యాండ్ ప్రధాని మ్యూట్ ఎజెడ్, ట్రంప్ ప్రకటనపై స్పందించారు. తాజాగా డానిష్ రక్షణ మంత్రి ట్రాల్స్ ఎల్ పౌల్సన్ మాట్లాడుతూ ఈ ప్రాంత రక్షణ బడ్జెట్‌ను రెండంకెల బిలియన్ డాలర్లకు పెంచే విషయమై పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈప్రాంతం వైపు వచ్చే నౌకలను తనిఖీ చేయడం, రెండు లాంగ్ రేంజ్ డ్రోన్లను సమకూర్చుకోవడం, అదనంగా రెండు డాగ్ స్లెడ్ బృందాలను ఏర్పాటుచేయడం వంటివి దీనిలో ఉన్నాయి. నుక్‌లోని ఆర్కిటిక్ కమాండ్‌లో సిబ్బందిని పెంచి బలోపేతం చేయనుంది. ఎఫ్-35 సూపర్‌సోనిక్ విమానాలను మోహరించేలా గ్రీన్‌ల్యాండ్లోని మూడు పౌర విమానాశ్రయాలను అప్‌గ్రేడ్ చేయాలని భావిస్తోంది. గత కొన్నేళ్లుగా తాము ఆర్కిటిక్ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేశామని పౌల్సన్ అభిప్రాయపడ్డారు. ఇకపై ఈ ప్రాంతంలో తమ మోహరింపులు బలంగా ఉంటాయన్నారు. గ్రీన్‌ల్యాండ్ ప్రస్తుతం డెన్మార్క్‌లో అటానమస్ రీజియన్‌గా ఉంది. ఇక్కడ అమెరికాకు చెందిన భారీ అంతరిక్ష కేంద్రం ఉంది. దీనిని తొలి ఎయిర్‌బేస్‌గా పిలుస్తుంటారు. ఉత్తర అమెరికా నుంచి ఐరోపాకు వెళ్లే షార్ట్‌కట్ మార్గం గ్రీన్‌ల్యాండ్ సమీపంలో ఉంది. ఈ ద్వీపంలో అత్యధిక స్థాయిలో ఖనిజ సంపద ఉంది. గ్రీన్ ల్యాండ్‌ను తమ దేశంలో విలీనం చేసుకోవాలన్న అమెరికా ప్లాన్ ఇప్పటిది కాదు. 1860ల్లోనే నాటి అధ్యక్షుడు ఆండ్రూ జాన్సన్ కూడా ఈ ప్రాంతంపై ఆసక్తి చూపారు. 2016లో అధ్యక్షుడు అయిన ట్రంప్.. తన పదవీకాలం చివరన 2019లో గ్రీన్ ల్యాండ్‌ను కొనుగోలు చేస్తానని ఆఫర్ ఇచ్చారు. కానీ, దీనికి అప్పట్లో డెన్మార్క్ నుంచి ప్రతికూల స్పందన వచ్చింది. దీంతో నాడు ట్రంప్ ఆ దేశ పర్యటనను రద్దు చేసుకొన్నారు. ప్రపంచంలోని 13శాతం చమురు.. 30 శాతం గుర్తించని గ్యాస్ నిల్వలున్నట్లు భావిస్తున్న ఆర్కిటిక్‌లో ఇది భాగం. అతితక్కువ జనావాసం ఉన్న ఈ ప్రాంతంలో ట్రంప్ రియల్ ఎస్టేట్ వెంచర్లు చేపట్టాలని భావించినట్లు కూడా చెబుతుంటారు. 21 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉన్న ఈ ప్రాంతంలో కేవలం 56,500 మంది మాత్రమే జీవిస్తున్నారు. 75శాతం భూభాగం ఎప్పుడూ మంచు కిందే ఉంటుంది.

## జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందాడు.. సీఎం రేవంత్ రెడ్డిపై పట్నం నరేందర్ రెడ్డి ఆగ్రహం



సీఎం రేవంత్ రెడ్డి పాలనంతా డైవర్షన్ పాలిటిక్స్ అని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి విమర్శించారు. లగచర్ల దాడి ఘటనలో తనపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారని మండిపడ్డారు. 37 రోజులు జైల్లో పెట్టి రేవంత్ రెడ్డి పైశాచిక ఆనందం పొందారని అన్నారు. లగచర్ల ఘటనలో కేటీఆర్‌ను కూడా ఇరికించే ప్రయత్నం చేశారని పట్నం నరేందర్ రెడ్డి మండిపడ్డారు. ఓట్లు వేసి గెలిపించిన రైతులకు బేడీలు వేసిన ఘనత రేవంత్ రెడ్డిదే అని ధ్వజమెత్తారు. ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టిపెట్టాలని రేవంత్ రెడ్డికి సూచించారు. రైతుబంధుపై పెద్ద పెద్ద మాటలు చెప్పి మాట తప్పారని రేవంత్ రెడ్డిని పట్నం నరేందర్ రెడ్డి విమర్శించారు. అల్లు అర్జున్ అంశంపై గంటసేపు అసెంబ్లీలో రేవంత్ రెడ్డి మాట్లాడారని పేర్కొన్నారు. కానీ రైతుల సమస్యలపై మాట్లాడమంటే సభను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు.

## సంధ్య థియేటర్ ఘటన.. తప్పుడు పోస్టులపై పోలీసుల వార్నింగ్

హైదరాబాద్: సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై సోషల్ మీడియాలో ఎవరైనా తప్పుడు సమాచారం పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. "తొక్కిసలాట ఘటనపై సోషల్ మీడియాలో తప్పుడు సమాచారంతో పాటు ప్రజలను అపోహలకు గురిచేసేలా వీడియోలు పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నటుడు అల్లు అర్జున్ రాకముందే తొక్కిసలాట జరిగినట్లు కొందరు తప్పుడు వీడియోలు పోస్ట్ చేసిన అంశం మా దృష్టికి వచ్చింది. ఘటనపై విచారణ క్రమంలో తెలిసిన నిజాలను వీడియో రూపంలో పోలీసుశాఖ ఇప్పటికే ప్రజల ముందు ఉంచింది. ఉద్దేశపూర్వకంగా పోలీసు శాఖను బద్నాం చేసేలా తప్పుడు పోస్టులు పెడితే తీవ్రంగా పరిగణిస్తాం. ఈ ఘటనకు సంబంధించి ఏ పౌరుడి దగ్గరైనా ఆధారాలు, అదనపు సమాచారం ఉంటే మాకు అందించవచ్చు" అని నగర పోలీసులు పేర్కొన్నారు.




## అందరం ఒక్కటై ఆ కుట్రలను తిప్పికొట్టాలి.. హరీశ్‌రావు పిలుపు

సిద్దిపేటలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏసు క్రీస్తు జన్మించిన డిసెంబర్ మాసం వచ్చిందంటే క్రైస్తవులందరికీ సంతోషంగా ఉంటుందని అన్నారు. ఈ క్రిస్మస్ మనందరికీ శాంతిని, సౌభ్రాతృత్వాన్ని, సహనాన్ని, క్షమాగుణాన్ని నేర్పుతుందని పేర్కొన్నారు. ఎదుటివారి పట్ల జాలి, దయ, క్షమాగుణం కలిగి ఉండాలని ఏసుక్రీస్తు ప్రబోధించారని హరీశ్‌రావు అన్నారు. తోటివారిని ప్రేమించండి.. తోటి వారికి ఉపకారం చేయండి.. పది మందికి సహాయం చేసినపుడే నీ జన్మ ధన్యమవుతుందని ప్రభువు చెప్పారని తెలిపారు. తనను శిలువ వేసిన వారిని, తనను నానా మాటలు అన్నవారిని కూడా క్షమించండి అన్న గొప్ప దయామయుడు ఏసు క్రీస్తు అని కొనియాడారు. అందుకే ఏసుక్రీస్తు గొప్పతనాన్ని ప్రపంచమంతా గుర్తించిందని అన్నారు. దేశంలో క్రిస్మస్ పండుగను రాష్ట్ర పండుగగా జరిపిన ఒకే ఒక ముఖ్యమంత్రి కేసీఆర్ అని హరీశ్‌రావు కొనియాడారు. క్రిస్మస్ తెల్లవారి బాక్సింగ్ డే రోజు కూడా కేసీఆర్ సెలవుగా ప్రకటించారని గుర్తుచేశారు. బతుకమ్మ పండుగకు హిందువులు, రంజాన్ పండుగకు ముస్లింలు, క్రిస్మస్ పండుగకు క్రైస్తవులు కొత్త బట్టలతో ఉండాలని కేసీఆర్ పదేళ్లపాటు తోఫాను అందించారని తెలిపారు. కానీ, దురదృష్టవశాత్తు ఇప్పుడున్న ప్రభుత్వం ఆ తోఫాలను కొనసాగించకుండా ఆపేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా మీ అందరి జీవితాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరియాలని, మీ కోరికలు, కలలన్నీ నిజం కావాలని ఆకాంక్షిస్తున్నానని హరీశ్‌రావు అన్నారు. మీ భవిష్యత్తు బంగారుమయం కావాలని, ఉజ్వలంగా ఉండాలని ఆ ఏసు ప్రభువును మనసారా ప్రార్థిస్తున్నానని తెలిపారు. ఏసు ప్రభువు చెప్పిన విషయాలన్నింటినీ మనం జీవితంలో ఆచరించాలన్నారు. అప్పుడే అపుడే ఏసు ప్రభువు పట్ల మనం నిజమైన భక్తి చూపిన వారమవుతామని పేర్కొన్నారు. పగ, ప్రతీకారాలతో సమాజం దెబ్బతినే ప్రమాదం ఉన్నదని హరీశ్‌రావు అన్నారు. ఇవాళ కులాల మధ్య చిచ్చు రేగుతున్నదని.. మతాల మధ్య కలహాలు పెరుగుతున్నయని.. దేశాల మధ్య యుద్ధాలు జరుగుతున్నాయని తెలిపారు. కులమేదైనా, మతమేదైనా, దేశమేదైనా అందరూ సమానమే అని భగవద్గీతలోనైనా, ఖురాన్ లో అయినా, బైబిల్ లో అయినా అదే చెప్పారని అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగంలో మనందరికీ సమానమైన హక్కుల్ని కల్పించారని తెలిపారు. కొన్ని శక్తులు, కొందరు వ్యక్తులు మతాల మధ్య చిచ్చుపెట్టి మనల్ని విభజించి పాలించాలని చూస్తున్నారని.. మనమందరం ఒక్కటై ఆ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మనందరి అభివృద్ధిలోనే రాష్ట్ర అభివృద్ధి, దేశ అభివృద్ధి ఉన్నదని గుర్తుంచుకొని నడవాలన్నారు.




## భారాస ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి పోలీసుల నోటీసులు



**హైదరాబాద్: భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి బంజారాహిల్స్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు విచారణకు రావాలని పేర్కొన్నారు. బంజారాహిల్స్ పీఎస్‌లో విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైన విషయం తెలిసిందే.**

## వాజ్‌పేయీ పదవులకు ఆశపడకుండా నిస్వార్థంగా పని చేశారు: కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్: మాజీ ప్రధాని వాజ్‌పేయీ భారత దేశ వైభవాన్ని, నైతిక విలువలను ప్రపంచానికి చాటారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన వాజ్‌పేయీ శత జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. చిత్రపటానికి నివాళి అర్పించిన అనంతరం మాట్లాడారు. వాజ్‌పేయీ పదవులకు ఆశపడకుండా నిస్వార్థంగా పని చేశారని పేర్కొన్నారు. ఒక్క ఓటుతో అధికారం కోల్పోయినా.. ప్రజాతీర్పు కోరి మళ్లీ అధికారంలోకి వచ్చారని కొనియాడారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్తున్న పార్టీ భాజపా అన్నారు. అబద్ధాలతో ముందుకు వెళ్తున్న పార్టీ కాంగ్రెస్ అని ఎద్దేవా చేశారు. అబద్ధాల్లో ఆ పార్టీకి ఆస్కార్ అవార్డు ఇవ్వవచ్చన్నారు. బడుగు, బలహీనర్గాలు ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతుగా ఉన్నాయని చెప్పారు.

**రేవంత్‌రెడ్డి ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారు: భాజపా ఎంపీ లక్ష్మణ్...** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కమ్యూనిస్టు వేషాన్ని వేసుకొని ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని భాజపా ఎంపీ లక్ష్మణ్ అన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతోందని చెప్పారు. ఆ పార్టీ నేతలు భాజపా, కేంద్ర ప్రభుత్వం మీద విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. దేశానికి వెన్నుపోటు పొడిచి.. మీడియా ముందుకొచ్చి మొసలి కన్నీరు కారుస్తానంటే ఎవరు నమ్మరని ఎద్దేవా చేశారు. సైనికులను కూడా కాంగ్రెస్ పార్టీ అవహేళన చేసి మాట్లాడుతోందని మండిపడ్డారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com